వైయస్సార్ కడప జిల్లాగా పేరు మార్పు పట్ల హర్షం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు, జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

వార్త మెయిన్‌లో



విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

బుధవారం 19 మార్చి, 2025 | 8 పేజీలు

అసంపూర్తిగా ఉన్న పక్కాగృహాలను

త్వరితగతిన పూర్తిచేయాలి: హౌసింగ్ పీడీ

విశాలాంధ్ర–లక్కిరెడ్డిపల్లె : 2019–2024 మధ్య కాలంలో మంజూరై ఇళ్లను నిర్మించుకోలేక మధ్యలో ఆగిపోయిన గృహాలను త్వరితగతినే పూర్తి చేయలని హౌసింగ్ పీడీ శివయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అనంతపురం, హరిజనవాడ, వడ్డెపల్లె, చౌటపల్లె గ్రామాలలో అసంతృప్తిగా ఉన్న పక్కాగృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్దిదారులతో మాట్లాడుతూ స్తోమత లేక ఇల్లు నిర్మించుకోలేక మధ్యలో ఆగిపోయిన వాటికి ప్రభుత్వం అధనంగా ఎస్సీ, బిసీ 50 వేలు, ఎస్టీలకు 75వేల రూపాయలు ఇస్తోందని లబ్దిదారులు ముందుకు వచ్చి ఇల్లు నిర్మించుకోవాలన్నారు. పనులు మొదలు పెట్టిన వెంటనే బిల్లులు ఇస్తామన్నారు. చాలా మంది లబ్దిదారులకు ప్రభుత్వం అందిస్తున్న అదనపు బిల్లుకు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అసంతృప్తిగా ఉన్న పక్కా ఇల్లుకు రాష్ట్ర ప్రభుత్వం 350 కోట్ల రూపాయలు మంజూరు చేసిందన్నారు. అలాగే పక్కాగృహాలు లేని అర్హులైన నిరుపేదలు 2025–26 సంవత్సరానికి సంబందించిన పక్కా గృహాల కోసం ధరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఆయా గ్రామ సచివాలయల్లో, మండల హౌసింగ్ కార్యాలయంలో ధరఖాస్తులు ఆన్లైన్ చేసుకోవచ్చున్నారు. ఈ ఏడాది మంజూరు అయ్యే ఇల్లుకు 4.30 లక్షల రూపాయలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ధరఖాస్తుదారులు ఎస్సీ,ఎస్టీ,బిసీలు తప్పక కుల, ఆదాయ, ధృవపత్రాలను సమర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జనార్దన్, అస్టెంట్ ఇంజనీర్లు అంజి తదితరులు పాల్గొన్నారు.

భూ రీ సర్వే పక్కాగా నిర్వహించాలి :ఆర్డీవో

విశాలాంధ్ర–రామాపురం : భూ రీ సర్వే పక్కాగా నిర్వహించాలని అన్నమయ్య జిల్లా ఆర్డిఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నల్లగుట్ట పల్లి గ్రామ పొలంలో భూ రీ సర్వే చేస్తున్న రికార్డును మంగళవారం ఆయన పరిశీలించారు. ఎన్ని ఎకరాలు ఉన్నాయి, అందులో డ్రైలాండ్, వెట్ ల్యాండ్ విస్తీర్ణం ఎంత, రీసర్వే ఎప్పుడు మొదలుపెట్టారు, ఎన్ని టీములు సర్వే చేస్తున్నాయి, ఇప్పటి వరకు ఎన్ని ఎకరాలలో సర్వే పూర్తి చేశారు ఇంకెంత చేయాలి అన్న వివరాలను తహసిల్దార్, మండల సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు.మండలంలో నల్ల గుట్ట పల్లి గ్రామ పొలంలో రీ సర్వే ప్రక్రియ జరుగుతోందని, తాసిల్దార్ రామాంజనేయులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో భూ రీ సర్వే ఇంకా కొద్దిగా చేయాల్సి ఉందని ఆర్డిఓ కు వివరించారు. ఈ గ్రామంలో రీ సర్వేకు మూడు టీములు ఏర్పాటు చేశామని అన్నారు. భూరి సర్వే నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ సూచించారు.అనంతరం పిజిఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం ప్రగతిపై కూడా కలెక్టర్ సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. తాసిల్దార్ రామాంజనేయులు ఆర్ఐ సమద్ ఖాన్ వీఆర్వోలు వీఆర్ఏలు సర్వేలు పాల్గొన్నారు.

'చెక్' లేని చెక్‌పోస్టు

అక్రమ ఇసుక రవాణాకు అడ్రస్సు

విశాలాంధ్ర–రామసముద్రం : అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలోని కర్ణాటక సరిహద్దులోని చొక్కాడ్లపల్లి వద్ద ఉన్న చెక్ పోస్ట్ తనిఖీ చేసేవారు దిక్కులేదు దీంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్రస్ గా మారింది గ్రామ సమీపంలోని చిలకమ్మతూరు చెరువు ఇసుక రవాణా దారులకు అడ్డాగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు ఇప్పటికే చెరువులో జెసిబి సహాయంతో కర్ణాటకకు అక్రమంగా ఇసుకను వందలాది ట్రాక్టర్లు తరలించేసారని చెబుతున్నారు కర్ణాటక సరిహద్దు కిలోమీటర్ దూరం ఉండడం అక్రమార్కులకు కలిసి వస్తోంది ఇప్పటికైనా పోలీస్ రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ ఇసుక దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లింగాలలో పునుగుపిల్లి సంచారం

విశాలాంధ్ర–లింగాల: లింగాల పంచాయతీ పరిధిలో పునుగుపల్లి సంచరిస్తున్నట్లు కొందరు గ్రామస్థులు గమనించారు. లింగాలలోని ఇండెన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద సోమవారం అరుదైన పునుగుపిల్లి ప్రత్యక్షమై అనంతరం కాసేపటికి మాయమైంది. లింగాల సమీపంలో శేషాచల అడవీ ప్రాంతం ఉంది. ఆ ప్రాంతాల్లో మాత్రమే కనిపించే ఈ జంతువు జనావాసాల్లో ప్రత్యక్షమవ్వడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు పునుగుపిల్లి కనిపించిన ప్రాంతాన్ని సందర్శించారు. జంతువుకు ఎలాంటి హాని తలపెట్టకూడదని అధికారులు ప్రజలకు సూచించారు. అడవి జంతువులను వెంటాడినా వేటాడినా వధించినా వన్యమృగ చట్టం ప్రకారం నేరమన్నారు. అయితే కొద్ది సేపటికే ఆ పునుగుపిల్లి సమీపంలోని చెట్టు నుంచి దూకి అరటి తోటల్లోకి వెళ్లిపోయింది.

పునుగుపిల్లి ప్రత్యేకత

పునుగుపిల్లి ప్రధానంగా శేషాచలం అడవుల్లో కనిపించే అరుదైన జంతువులలో ఒకటి. ఈ జంతువు శరీరం నుంచి స్రవించే ప్రత్యేక తైలాన్ని "పునుగు తైలం" అని పిలుస్తారు. ఈ తైలానికి తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి పూజల్లో విశేష ప్రాముఖ్యత ఉంది. తిరుమలలోని ప్రత్యేక సంరక్షణ కేంద్రంలో వీటిని పోషిస్తూ, స్వామివారి పూజల కోసం పునుగు తైలం సేకరిస్తారు. ప్రతి శుక్రవారం శ్రీ వేంకటేశ్వర స్వామివారి అభిషేకానంతరం విగ్రహానికి కొంత మోతాదులో పునుగు తైలం పులుముతారు. ఇది భక్తుల విశ్వాసాన్ని పెంచే సంప్రదాయాల్లో ఒకటిగా నిలిచింది.పునుగుపిల్లి జనావాసాల్లో కనిపించడం అరుదైన సంఘటన కావడంతో స్థానికులు ఈ ఘటనను ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

పశువైద్య శిబిరం విజయవంతం

విశాలాంధ్ర - సుండుపల్లి : మండలంలోని సొంతంవారిపల్లి గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సహకారంతో పశు వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కడప జిల్లా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి అన్నమయ్య జిల్లా పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డా. కె. గుణశేఖర పిళ్ళై రాయచోటి ఉపసంచాలకులు డా. డి.మాల కొండయ్య,డాక్టర్ టీ వి రమణయ్య, డిప్యూటీ డైరెక్టర్ కడప, రంగస్వామి డిప్యూటీ డైరెక్టర్ వీపీసీ కడప, రాజ శేఖర్ డిప్యూటీ డైరెక్టర్ ఏ డి డి యల్ కడప, డాక్టర్ సంధ్య రాణి ,డాక్టర్ శివరామి రెడ్డి, శరత్ కుమార్ సెమిన్ బ్యాంకు,టి సుండుపల్లి సహాయ సంచాలకులు డా. కె. విజయకుమార్, శివారెడ్డి సహాయ సంచలకులు రాయచోటి, శ్రీధర్ రెడ్డి సహాయ సంచలకులు సంబెపల్లి, డా లోకేష్ సహాయ సంచలకులు రాయచోటి,డాక్టర్ రవికుమార్ రాయచోటి, ముఖ్య అతిథులుగా విచ్చేసి పశువైద్య శిబిరాన్ని విజయవంతం చేయడం జరిగింది. ఈ శిబిరంలో 143 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు, 4 నెలల నుంచి 8 నెలల వయసులో ఉన్న 25 దూడలకు బ్రూసేల్లోసిస్ వ్యాధి టీకాలు,47 పశువులకు గర్భకోష పరీక్షలు ,75 పశువులకు సాధారణ చికిత్సలు మరియు 160 పశువులకు బ్యుటాక్స్ పిచికారి కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గర్భకోశ వ్యాధి నిపుణులు డా.జగన్నాథ రెడ్డి, సొంతంవారిపల్లి సందీప్ నాయక్ మరియు మండల సిబ్బంది పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముక్కా వరలక్ష్మి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : నియోజక వర్గంలోని వివిధ మండలాలు రైల్వేకోడూరు, ఓబులవారి పల్లి,చిట్వేల్, పుల్లంపేట,పెనగలూరు మండలాల నుంచి వచ్చే కూటమి నాయకుల, కార్యకర్తల సమస్యల పరిష్కారంలో కడప కుడ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి తలమునకలై ఉన్నారు.వివధ ప్రాంతాల నుంచి సమస్యలపై ముక్కావారిపల్లిలోని స్వగృహానికి వచ్చే వారిని అప్యాయంగా పలకరించి సమస్యలను ఓపికతో వింటూ సమస్యను పూర్తిగా అర్థం చేసుకుని తక్షణం సంబందిత అధికారులతో సామరస్యంగా మాట్లాడి పరిష్కరిస్తూ వస్తున్నారు. ఎంత మంది వచ్చినా అందరి సమస్యలు పరిష్కరించి వారిలో సంతోషాన్ని నింపుతున్నారు.దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి స్వగృహం వద్ద ఉదయం టిఫిన్, మద్యాహ్నం భోజనం ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.ఎప్పుడైనా రాండి ఇది మాఇల్లు కాదు మీ ఇల్లు మీకు మేము అండగా ఉంటాం అధైర్యపడవద్దు అని భరోసా ఇస్తున్నారు.ఆరోగ్య పరంగా తీవ్ర ఇబ్బందులు పడే అర్హులైన నిరుపేదలకు తోచిన సహాయం అందించి వారిలో వెలుగు నింపుతున్నారు.ప్రతి రోజు అనేక సమస్యలపై ముక్కావారిపల్లికి అనేక మంది వస్తున్నారు.అందరి సమస్యలు పరిష్కరించి సంతోషంగా పంపిస్తున్నారు.ప్రతి రోజు జనం ఎగబడుతున్నారు. నియోజకవర్గ ప్రజలకు ముక్కారూపానందరెడ్డి కుటుంబం అండగా నిలబడింది.ఈ కార్యక్రమంలో సింగమాల మల్లిఖార్జున రెడ్డి,బత్తిన వేణుగోపాల్ రెడ్డి, పిఎస్ వేణు తదితరులు పాల్గొన్నారు.

జన సైనికుడు..అతికారి

పదవి కోసం కాదు..పవన్ కోసమే

నమ్ముకున్న నేత అడుగు జాడల్లోనే.. పార్టీ సిద్ధాంతాలతో నిత్యం జనంలోనే..

నియోజకవర్గ ప్రజల అభిమాన నేతగా ఎదుగుతూ.. విశాలాంధ్రతో.. పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ

విశాలాంధ్ర -రాజంపేట: జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీలో పదవి కాదు.. ప్రజలే ముఖ్యం.. అనే సిద్ధాంతంతో జన జన సైనికుడిగా ఎన్ని అడ్డంకులు ఎదురైనా చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో ప్రజల పక్షాన దశాబ్దాలుగా పోరాడుతూ వస్తున్న పవన్ తోనే ఆయన పయనం. నమ్ముకున్న నేత అడుగు జాడల్లోనే వెళుతూ.. తన వెంటే ఉన్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, కష్టమని వచ్చిన వారు ఎవరైనా నేనున్నానని భరోసా కల్పించి, గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ విధానాలను ధైర్యంగా,దూకుడుగా ఎదుర్కొంటూ ముందుకు వెళ్లిన తీరు ప్రత్యర్థులకు ఆయన ఒక సింహ స్వప్నం. ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితం కాకుండా పార్టీ ఇచ్చిన పిలుపుతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మండలంలో అందరికీ అండగా, తోడుగా నిలుస్తూ, అందరి వాడిగా పేరు తెచ్చుకున్న ఘనత ఆయనకే సొంతం.రాజకీయ జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, పోరాటాల ధీరుడిగా రాజంపేట నియోజకవర్గంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటరీ సమన్వయకర్త అతికారి కృష్ణ పై విశాలాంధ్ర ప్రత్యేక కథనం.

అభిమానిగా, ఆరాధ్య కథానాయకుడిగా పవన్ కళ్యాణ్ ను మొదటి నుండి ప్రేమిస్తూ.. అనుసరిస్తూ వచ్చిన అతికారి కృష్ణ, చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ నుండి పవన్ తో పార్టీ కోసం పనిచేస్తూ వచ్చారు.అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజక వర్గంలో బలమైన కాపు సామా జిక వర్గానికి చెందిన నేతల వెన్నంటే ఉన్న ఆయన జనసేన పార్టీ ఆవిర్భావం నుండి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీని క్షేత్రస్థాయిలో బలపడడానికి శక్తి వంచన లేకుండా కృషి చేయడంతో పాటు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. అతికారి కృష్ణ పనితనాన్ని గుర్తించిన అధినేత పవన్, కళ్యాణ్ 2019లో నియోజకవర్గ నాయకుడిగా అవకాశం కల్పించారు. పదవులు లేని సమయంలోనే జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తిరుగుతూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చిన కృష్ణ నియోజకవర్గ నాయకుడిగా ప్రతి గ్రామాన్ని సందర్శించి స్థానిక సమస్యలు తెలుసుకుంటూ అక్కడే ఉన్న జనసైనికులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యి సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేశారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలను లక్ష్యాలను ప్రజల్లోకి మరింత లోతుగా తీసుకువెళ్లేందుకు నిరంతరం పనిచేస్తూ వచ్చారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలపడే విధంగా పవన్ అభిమానులను, జనసైని కులుగా తీర్చిదించేందుకు పార్టీలోనికి పెద్ద ఎత్తున యువతను ఆకర్షించేందుకు తనదైన శైలిలో పనిచేస్తూ ముందుకు సాగుతున్నారు. జనసేన పార్టీ ఒక కులానికి సంబంధించింది కాదు. అని, అన్ని కులాలకు అండగా ఉంటుందని భావన ప్రజల్లోకి తీసుకు వెళ్లడంలో ఈయన సఫల మయ్యారనే చెప్పాలి. కష్టం అని తన దగ్గరకు వచ్చే ప్రతి ఒక్కరికి న్యాయం' చేసి వారిని సంతోషంగా ఇంటి నుంచి పంపించే విధంగా కృషి చేస్తున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జన సైనికుల కుటుంబాలకు తన వంతు సహాయంగా ఆర్థిక సహాయాన్ని అందజేసి బాసటగా నిలుస్తున్నారు. ఆర్థిక సమస్యలతో ఉన్నత చదువుకు చదవలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచి విద్యా ప్రదాతగా వెలుగులు నింపుతున్నారు.రానున్న రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో ప్రజల సంక్షేమానికి పెద్దపీట వెయ్యడమే తన లక్ష్యమన్నారు.

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కీలక పాత్ర..

ఈనెల 14వ తేదీన పిఠాపురంలో జరిగిన జనసేన పార్టీ 12 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ కీలక పాత్ర పోషించారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో జనసేన పార్టీ నాయకులను, కార్యకర్తలను ఒక తాటిపై తీసుకొచ్చి ముఖ్య భూమిక పోషించారు. అన్ని ప్రాంతాల వారికి వాహన సౌకర్యం కల్పించి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారని చెప్పడంలో సందేహం లేదు.

నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న మునిసిపల్ పాలకవర్గం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగర పాలక సంస్థ పరిధిలో చెరగని ముద్ర వేసిన దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అని మంగళవారంతో మూడవ పాలకవర్గం ఏర్పడి 4 సంవత్సరాలు పూర్తయిందని వైయస్సార్ సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి 47వ డివిజన్ కార్పొరేటర్ పాక సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ 4 సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి పనులకు సహకరించి నాయకులకు, అధికారురాలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కడప జిల్లాను, కడప నగరాన్ని రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి వచ్చిన అందరు ముఖ్యమంత్రులు నిర్లక్ష్యము చేశారన్నారు. కొందరు ముఖ్యమంత్రులు ఇది వైయస్సార్ జిల్లా అని నిధులు కెటాయించడంలో సవతి తల్లి ప్రేమ చూపించారన్నారు. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమత్రిగా ప్రమాణం స్వీకారం చేసినప్పటి నుంచి కడప జిల్లాను అభివృద్ధిలొ పరుగులు పెట్టించారని కొనియాడారు. కడప నగరానికి సంబందించి వున్న పంచాయితీలను అన్ని కలిపి మున్సిపాలిటిలో కలపి నగరపాలక సంస్థగా మార్చి వెల కోట్ల రుపాయలు వెచ్చించి కడప నగరపాలక సంస్థను అభివృద్ధిలో పరుగులు పెట్టించారన్నారు. ఆయన మరణించిన తరువాత మళ్ళి కడప అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా మూలన పడిపోయినా ఎవరు పట్టిచ్చుకోలేదన్నారు. సోమశిల శాశ్విత మంచినీటి పథకం, బుగ్గవంక సుందరీకరణకు నిధులు కేటాయించలేదన్నారు. మళ్లీ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పుడు నుంచి పెండింగ్లో వున్న ప్రాజెక్టలు అన్ని మరల ప్రారంభానికి నోచుకున్నాయన్నారు. 3 వ సారి నగరపాలక సంస్థ ఏర్పడి 4 సంవత్సరాలు పూర్తి కాలములో దాదాపుగా 2500 కోట్ల రూపాయలతో అబివృద్ధి పనులు చేయడం జరిగినదన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాజీ డిప్యూటీ సిఎం అంజాద్ భాషా, మెయర్ సురేష్ బాబు, పాలక వర్గం అందరూ కలసి కట్టుగా అప్పటి కమిషనరు సూర్య సాయి ప్రవీణ్ చంద్ సహకరించి అనేక అభివృద్ది కార్యక్రమాలు ముఖ్య కూడళ్ల అభివృద్ధి, రోడ్ల విస్తరణ పనులు, పార్కుల అభివృద్ధి, రోడ్లు మరియు కాలువల నిర్మాణాలు చేయడం జరిగినదన్నారు. ఈ కార్యక్రమాలకు దాదాపుగా 2500 కోట్ల రూపాయలు మంజూరు చేశారని తెలిపారు. ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ నాలుగేళ్ల లో పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయడం జరిగింది. అలాగే బ్రహ్మసాగర్ నుండి నగర పాలక సంస్థకు శాశ్విత మంచి నీళ్ల నిర్మాణానికి టెండర్లు పిలవడం జరిగినది. పెండింగులో ఉన్న బుగ్గవంక పనులను దాదాపుగా పూర్తి చేయడం జరిగినది. కానీ నిన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగినదన్నారు. ఎన్డిఎ ప్రభుత్వం ఏర్పాటు చేసి 10 నెలలు పూర్తి చేసుకున్న తర్వాత కూడా అభివృద్ధి పనులు నత్త నడకన సాగుతూ ఉన్నాయన్నారు. ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చలేదన్నారు. మూడవ పాలకవర్గం ఏర్పడి 4 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా అభివృద్ధి పనులు పూర్తి చేయుటకు సహకరించిన అధికారులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రాబోవు రోజులలో కూడా గడిచిన ప్రభుత్వాలు మాదిరిగా కడప నగరపాలకసంస్థ కు నిధులు మంజూరు చేయు విషయం లో నిర్లక్ష్యం చేయవద్దని కోరుతున్నామన్నారు. అలాగే ఈ ప్రభుత్వం పెండింగ్లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని, బ్రహ్మసాగర్ నుంచి వచ్చే మంచినీటి నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని, బుగ్గవంక పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని పెండింగ్లో ఉన్న రోడ్లు విస్తరణ పనులను పూర్తి చేయాలని కోరుచున్నాము. మా పాలకవర్గం అభివృద్ధి పనులు పూర్తి సహకారం అదిస్తామని తెలిపారు. నగరపాలకసంస్థ అభివృద్ధి కీ రాజకీయాలకు, పార్టీలకు, వర్గాలకు అతీతంగా అందరమూ కలసి కట్టుగా పనిచేద్దాం అని పిలుపునిచ్చారు.రాజకీయాలుకు అతీతంగా నాగరాభివృద్ధి కోసం అందరిని సమన్వయం చేసుకుంటూ పోతామన్నారు. నగరవావృద్ధికి సహకరించకపోతే పోరాటానికి వెనుకాడమని ఎంత పోరాటానికైనా సిద్ధంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమములో 40 డివిజన్ కార్పొరేటర్ రాచమల్లు బాలస్వామి రెడ్డి, జనరల్ సెక్రటరీ రెడ్డి వరకుమార్ పాల్గొన్నారు.

NAME CHANGE

I hitherto known as PALOORY SRINIVASULU S/O R OBULESU, R/O 5-1-405, Brahmanapalli, Pulivendula, Cuddapah-516390, Andhra Pradesh, have changed my Name and Shall hereafter be known as RICHEAVENCARAR CARVELTHON. Iam changing my name only and not my Religion.

NAME CHANGE

I hitherto known as PALOORY MUNEMMA W/O SRINIVASULU, R/O 5-1-405, Brahmanapalli, Pulivendula, Cuddapah-516390, Andhra Pradesh, have changed my Name and Shall hereafter be known as RICHEAVENCARAR RAHMONEY. Iam changing my name only and not my Religion.

NAME CHANGE

I hitherto known as PALOORY NAGA SUVARNA D/O SRINIVASULU. R/O 5-1-405, Brahmanapalli, Pulivendula, Cuddapah-516390, Andhra Pradesh, have changed my Name and Shall hereafter be known as RICHEAVENCARAR RICHRU. Iam changing my name only and not my Religion.

నగలు చోరీ-కేసు నమోదు

విశాలాంధ్ర - సుండుపల్లి : మండల పరిధిలోని ముడుంపాడు పంచాయతీ పించాలో ఏటూరి అమ్మణమ్మ ఇంట్లో బంగారు గొలుసు చోరీ జరిగినట్లు బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. పించాకు చెందిన అమ్మణమ్మ ఈనెల 8వ తేదీన బెంగుళూరులోని తన మనవడు దగ్గరకు వెళ్లి తిరిగి 17వ తేదీ ఇంటికి వచ్చి చూసేసరికి కిటికీ కడ్డీలు తొలగించి ఇంట్లో ఉన్న 35 గ్రాముల బంగారం 1,75,000 విలువచేసే బొట్టు చైన్ ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుట్టు శిక్షణకు ధరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: మహిళ లబ్ధిదారులకు కుట్టు మిషన్ శిక్షణ కొరకు ధరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ వి.మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. బిసి, కాపు(తెలగ, బలిజ, ఒంటరి), ఈబీసీ, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ మరియు బ్రాహ్మణ కులములకు చెందిన మహిళలు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. 2024-2025 సంవత్సరములో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బి.సి కార్పొరేషన్, కాపు కార్పొరేషన్, ఇబిసి, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ మరియు బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించిన మహిళా లబ్దిదారులకు బి.సి కార్పొరేషన్, కడప వారి ద్వారా కుట్టు మిషన్ శిక్షణ కొరకు ధరఖాస్తు ఏపీ-ఓబిఎంఎంఎస్ ద్వారా వారి పేరును ఆన్‌లైన్‌లో 22వ తేది లోపల ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిక కాబడిన లబ్ధిదారులకు శిక్షణ అనంతరం 75%పైగా హాజరు కలిగిన వారికి సర్టిఫికెట్ మరియు ఉచితంగా కుట్టు మిషన్ అందజేయడం జరుగుతుందని అన్నారు. 18 నుండి 50సంవత్సరాల మధ్య వయస్సు గల వారు అర్హులు అని, తెల్ల రేషన్‌కార్డు, ఆదాయ, కుల ధృవీకరణ పత్రములు మరియు ఆధార్ కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలని, ఒక కుటుంబం యొక్క తెల్ల రేషన్‌కార్డు నందు ఒక్కరు మాత్రమే లబ్ధి పొందుటకు అర్హులు అని అని తెలిపారు. లబ్ధిదారులు 45 రోజులు-రోజుకు 8గంటల శిక్షణ, 60రోజులు-రోజుకు 6గంటల శిక్షణ, 90రోజులు-రోజుకు 4గంటల శిక్షణ, అని వీటిలో ఏదైనా ఒక సమయమును ఎంపిక చేసుకోవాలన్నారు. 22వ తేది లోపల సంబంధిత సచివాలయం నందు వారి పేర్లను నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ వి.మల్లికార్జున కోరారు.

కేంద్ర జీఎస్టీ ఇన్స్పెక్టర్‌గా ఎంపికైన

బాలు వికాస్ కు ఘన సన్మానం

విశాలాంధ్ర- పీలేరు: కేంద్ర జీఎస్టీ ఇన్స్పెక్టర్‌గా ఎంపికైన బాలు వికాస్ కు పీలేరు పట్టణం లోని అగ్రగామి సంస్థ వి.ఎస్.ఎన్ సిద్ధార్థ పాఠశాల అధినేత్రి మాధవి, సిబ్బంది ఘన సన్మానం చేశారు. (సి.జి.ఎల్-2024) పరీక్షలో అఖిల భారత స్థాయిలో మెరిసి, జనరల్ కేటగిరీలో సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్‌లో జీఎస్టీ ఇన్స్పెక్టర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా, బాలు వికాస్ 7వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యనభ్యసించిన పీలేరు వి.ఎస్.ఎన్ సిద్ధార్థ పాఠశాలలో ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి లోకేశ్వర్ రెడ్డి హాజరై, బాలు వికాస్ విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు."వి.ఎస్.ఎన్ సిద్ధార్థ పాఠశాల, విద్యార్థులకు కేవలం పాఠ్యపుస్తకాల విద్యనే కాకుండా, ప్రతిభను వెలికితీసే ప్రత్యేకమైన శిక్షణ అందిస్తోంది. బాలు వికాస్ సాధించిన విజయంలో, అతని పట్టుదల, ఉపాధ్యాయుల బోధన, తల్లిదండ్రుల మార్గదర్శకత్వం ముఖ్య పాత్ర వహించాయి" అని ఆయన అన్నారు. ఇలాంటి విద్యార్థుల విజయం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలవాలని, పాఠశాలలో ప్రత్యేక కార్యాక్రమాలు నిర్వహించి, వారి విజయం వెనుక ఉన్న సూత్రాలను తెలియజేయాలని సూచించారు. వి.ఎస్.ఎన్ విద్యాసంస్థల అధినేత్రి వడ్లమూడి మాధవి మాట్లాడుతూ, "వి.ఎస్.ఎన్ పాఠశాలలో చదివిన విద్యార్థులు వేలాదిమంది రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాల్లో ఉన్నత స్థాయి ఉద్యోగులుగా ఉన్నారు. మా పూర్వ విద్యార్థి బాలు వికాస్ అఖిల భారత స్థాయిలో సాధించిన ఈ విజయంతో మా పాఠశాల స్థాయి మరింత పెరిగిందని అన్నారు. అతను మా ప్రియ శిష్యుడు. అతనిలో చిన్నప్పటినుంచే క్రమశిక్షణ, పట్టుదల కనిపించాయి" అని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు ప్రతాప్ రెడ్డి, యుగంధర్ నాయుడు మాట్లాడుతూ, "తన కఠోర కృషితో చిన్న వయస్సులోనే ఉన్నత స్థాయికి చేరుకోవడం గర్వకారణం. చనిపోయిన తని తండ్రి ఆత్మ ఎక్కడున్నా సంతోషిస్తుందని, తన తల్లి అన్నపూర్ణను సంరక్షించే బాధ్యత బాలు వికాస్ పైన ఉంది" అని అన్నారు. సన్మాన గ్రహీత బాలు వికాస్ మాట్లాడుతూ"నేను వి.ఎస్.ఎన్ సిద్ధార్థ పాఠశాలలో పొందిన విద్యా పాఠాలు, నాలోని ప్రతిభను వెలికి తీయటంలో కీలకపాత్ర పోషించాయి. నా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, నా కుటుంబం అందించిన మద్దతు లేకుంటే ఈ విజయాన్ని సాధించి ఉండే వాడిని కాదు " అని అన్నారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి లోకేశ్వర్ రెడ్డి మరియు వి.ఎస్.ఎన్ విద్యాసంస్థల అధినేత్రి వడ్లమూడి మాధవి చేతుల మీదుగా బాలు వికాస్‌కు శాలువా కప్పి, పూలహారం వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా సంఘం అధ్యక్షులు, ప్రముఖ కవి, మరియు బాలు వికాస్ మేనమామ జలకనూరి మురళీధర్ రాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్‌కు దిగితే కఠిన చర్యలు

విశాలాంధ్ర -మైలవరం : ఫ్యాక్షన్ కు దిగితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను మైలవరం సబ్ ఇన్స్పెక్టర్ శ్యామ్ సుందర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం రాత్రి మండలంలోని దోడియం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యస్ఐ మాట్లాడుతూ దోడియం గ్రామం ఫ్యాక్షన్ లో డి కేటగిరిలో ఉందని గ్రామంలో ఎలాంటి గొడవలు లేకుండ ప్రశాంతంగా ఉండాలని సూచించారు. ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కాబట్టి ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. గొడవలకు దిగితే రౌడీ షిట్ ఓపెన్ చేసి జైలు కు కూడా పంపడం జరుగుతుందని పేర్కొన్నారు. వాహనాల నూతన చట్ట ప్రకారం జరిమానాలు అధికంగా ఉన్నాయని వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపకూడదని తెలిపారు. తప్పకుండ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని అలాగే వాహన పత్రాలు ఉండాలని లేకుంటే జరిమానా భారీ స్థాయిలో ఉంటుందని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా యువత మద్యం, గుట్కా, గంజాయి వంట జోలికి పోకుండా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పరీక్షలు వ్రాసే విద్యార్థులు ఏకగ్రత తో చదువుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. అనంతరం రాత్రి అక్కడే బస చేశారు.

29న న్యాయవాదుల సంఘం ఎన్నికలు

విశాలాంధ్ర- రాయచోటి రూరల్ : ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు ఈనెల 29న రాయచోటి బార్ అసోసియేషన్ సాధారణ ఎన్నికలు జరిగేటట్లుగా రాయచోటి బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు అధ్యక్షులు ఎన్ ప్రభాకర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి పి రెడ్డయ్య ప్రకటించారు. ఎన్నికలు నిర్వహించడానికి సీనియర్ న్యాయవాది అయిన కే రాజకుమార్ రాజును అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా ఇలియాస్ భాషను ఎగ్జిక్యూటివ్ కమిటీ నియమించినట్లు వారు తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయు న్యాయవాదులు నామినేషన్లు వేయడానికి ఈనెల 20, 21,22 మూడు రోజులు ఉంటుందని తర్వాత 24న నామినేషన్ల పరిశీలన 25న నామినేషన్ ఉపచామరించుకోవడానికి సమయం ఉంటుందని 29న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు ఓటు హక్కు ఉన్న న్యాయవాదులందరూ ఓటింగ్ లో పాల్గొనవచ్చని, అదే రోజు ఐదు గంటలకు కౌంటింగ్ మొదలుపెట్టి ఎన్నికల ఫలితాలను విడుదల చేయనున్నట్లు ఎన్నికల అధికారి రాజకుమార్ రాజు ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారు

విశ్రాంత ప్రిన్సిపాల్ రామకృష్ణ ఆకస్మిక మృతి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ప్రభుత్వ విశ్రాంత ప్రిన్సిపాల్ వివాదరహితుడు, సౌమ్యుడు యర్రజన్ను రామకృష్ణ (84) ఆఖస్మికంగా మృతి చెందారు. ఈయన ఇంటర్మీడియట్ విద్యా శాఖలో 30 సంవత్సరాలు విశేష సేవలు అందించారు. తలుపుల, పుత్తూరు, కోడూరు తదితర ప్రాంతాలలో గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో లెక్చరర్ గాను, ప్రిన్సిపాల్ గాను పనిచేసి పేరు ప్రఖ్యాతులు సంపాదించారని ఎస్వి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎన్ శ్రీనివాసులు కొనియాడారు. కోడూరు టౌన్‌లోని న్యూ క్రిష్ణానగర్ రవీంద్రభారతి స్కూల్ సమీపంలో 20 తారీఖున గురువారం ఉదయం అంత్యక్రియలు జరుగుతాయని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ మృతి చెందిన విషయం తెలుసుకున్న తోటి బంధువులు, స్నేహితులు, అభిమానులు, కళాశాలల సిబ్బంది, ప్రముఖులు, విద్యార్దులు తదితరులు వెళ్లి పార్థీవ దేహంపై పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన మృతికి సంతాపం వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

క్షయ వ్యాధి గ్రస్తులను ఆదరిద్దాం

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె : క్షయవ్యాధిగస్తులను వెలివేయకుండా వారిని ఆదరించాలని క్షయవ్యాధి నివారణ సూపర్‌వైజర్ హరి పేర్కొన్నారు. క్షయ వ్యాధి వారోత్సవాలల్లో భాగంగా మంగళవారం బి.ఎర్రగుడిలో క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి గ్రస్తుడు తుమ్మిన, దగ్గిన గాలి నుంచి ఈ వ్యాధి వ్యాప్తి చెందుతున్నారు. రెండు, మూడు వారాల నుంచి విడవకుండా జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పి ఇలాంటి లక్షణాలు ఉన్న వారికి వ్యాధినిరోధక శక్తి తగ్గి క్షయవ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. వెంటే ప్రభుత్వ అసుపత్రికి వెళ్లి గల్ల పరీక్ష, రక్తపరీక్షలు చేయించాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వం 6 నెలలకు సంబందించిన మందులు ఉచితంగా అందిస్తుందన్నారు. అంతేకాకుండా క్షయ వ్యాధి గ్రస్తులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ప్రతి నెల పౌష్టిక ఆహారం కొరకు వెయ్యి రూపాయలు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు మంత్రి జన్మదినం సందర్భంగా

మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : నేడు రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖా మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి, అలాగే ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డిల జన్మదిన సందర్భంగా మెగా రక్తదాన శిబిరంతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు మండల టీడీపీ ఇంచార్జ్ యనమల మదన్ మోహన్ తెలిపారు. ఈ మెగా రక్తదాన శిబిరం నేడు ఉదయం 8:30 గంటలకు మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయం వెనుక బాగాన ఏర్పాటు చేసామని, అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. కావున మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రక్తదాతలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల టీడీపీ ఇంచార్జ యనమల మదన్ మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్తీఫుల్లా, జె.కె.రెడ్డి, సయ్యద్ మసూద్, డీలర్ ఆన్వర్, మల్లి, రవిశంకర్, హేమంత్, భాస్కర్ రెడ్డి, శంకర్, వెంకటరమణ పాల్గొన్నారు.

బస్టాండ్ గేటు, కాంప్లెక్స్ గదులు బహిరంగ వేలం పాట

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలోని బస్టాండ్ గేటు, కాంప్లెక్స్ నాలుగు గదులకు ఈ నెల 20న స్థానిక పంచాయతీ కార్యాలయంలో బహిరంగా వేలంపాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ సెక్రెటరీ సుదర్శన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరం బస్టాండ్ గేటు, కాంప్లెక్స్ గదులకు సంబందించి వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు బస్టాండ్ గేటుకు లక్ష రూపాయలు, గదులకు 20వేల రూపాయలు ధరావత్తులు చెల్లించి పాటలో పాల్గొనాలని పాట దక్కించుకున్న వారు మొత్తం రుసుం చెల్లించి రసీదు పొందవలయునని ఆయన తెలిపారు.

కటౌట్ నుంచి జారిపడిన కార్మికుడు

విశాలాంధ్ర - ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల పనులలో భాగంగా మంగళవారం కటౌట్లు కడుతుండగా పుల్లయ్య అనే వ్యక్తి కటౌట్ పైనుంచి జారీ కిందపడి స్పృహ కోల్పోయాడు. గతంలో కూడా ఇతనికి మూర్ఛకు సంబంధించిన వ్యాధి ఉన్నది అని తెలిసి కూడ కటౌట్ కట్టడానికి పురమాయించడం విశేషం. సంభదిత గుత్తేదారుడు సుమారు 20అడుగుల పైబడిన కటౌ అవుట్ కట్టమని పురమాయించడం ఎంతవరకూ సబబు అతనికి ప్రాణపయాం జరిగితే పూర్తి గా గుత్తేదారుడు తప్పిదంగా బావించి అతనిపై తగుచర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల ఆరోపిస్తున్నాయి కుటుంబంనికి నష్టపరిహారం చెల్లించాలి.

మిట్స్‌లో జాతీయ ఐపీ యాత్ర కార్యక్రమంలో

స్టాల్స్‌కు ఆహ్వానం

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ (మిట్స్) కలశాల నందు మేధో సంపత్తి ఆవిష్కరణ భవిష్యత్తును ఎలా రూపొందిస్తుందో అన్వేషించడానికి అంకితమైన రెండు రోజుల వర్క్‌షాప్ ను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. కళాశాలలోని మేధో సంపత్తి ఫెసిలిటేషన్ సెంటర్ వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనునట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ అన్నారు. ఈ నెల 21 మరియు 22, 2025 తేదీలలో కళాశాల ప్రాంగణం లో ఈ వర్క్‌షాప్ జరుగుతుందని ఆయనన్నారు. ఈ కార్యక్రమంలో నూతన ఆవిష్కర ణలను ప్రోత్సహించడం, సృజనాత్మక రచనలను రక్షించడం మరియు సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు స్టార్టప్‌లు, పరిశోధ కులు మరియు పరిశ్రమ నిపుణులను శక్తివంతం చేయడం లక్ష్యంగా నిర్వహిస్తునట్లు, ఈ వర్క్‌షాప్ భౌగోళిక సూచికలు, ట్రేడ్‌మార్క్‌లు, కాపీరైట్‌లు మరియు పేటెంట్‌లతో సహా మేధో సంపత్తి హక్కుల యొక్క కీలకమైన అంశాలను ఇందులో నిపుణులు వివరిస్తారని ఆయన అన్నారు. నూతన ఆవిష్కరణలు ప్రదర్శన కొరకై రెండు రోజుల పాటు స్టాల్స్ ను ఉచితముగా అందజేస్తున్నట్లు, స్టార్ట్ అప్ రంగం లో ఉన్న నూతన ఆవిష్కరణలను ప్రదర్శిం చవచ్చని ఆయన అన్నారు. స్టాల్స్ కొరకై 8712655134, 8712655132 నెంబర్లను సంప్రదిచవచ్చని అన్నారు.

దళితులపై దాడి బాధాకరం

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

విశాలాంధ్ర - రాయచోటి రూరల్ : ఈనెల 9న అన్నమయ్య జిల్లా, మదనపల్లి మండలం, వలసపల్లి గ్రామం లో బొగ్గిటి వారి పల్లెలో ప్రభుత్వ స్థలంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించుటకు బొగ్గిటి వారి పల్లె గ్రామస్తులైన ఎస్సీ మాల సామాజిక వర్గమైన టి నారాయణ, టి కృష్ణవేణి, టి రత్నమ్మ మిగతా గ్రామస్తులతో కలిసి చట్టబద్ధంగా అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించుటకు పూనుకున్నారు, ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన వాల్మీకి సామాజికవర్గం వ్యక్తులు అయినటువంటి పి ఆదినారాయణ, పి వెంకటేశు , బి నరసింహులు, కే శ్రీనివాసులు, పి శ్రీరాములు, పి శ్రీనివాసులు, పి లక్ష్మీనారాయణ, బి చెల్లప్ప, బి శంకర, బి రవి, బి అంజమ్మ, కె నరసమ్మ, పి దేవమ్మ, పి శాంతమ్మ, బి రెడ్డమ్మ మిగతా అనుచరులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి కేటాయించిన స్థలంలో వాల్మీకి సామాజిక వర్గం వారు గుడి ఏర్పాటుకు భూమిని చదును చేసుకుంటుండగా మేము అక్కడికి వెళ్లి ఈ స్థలం మన శాసనసభ్యులు విగ్రహేర్పాటుకు కేటాయించిన స్థలం మీరు ఎందుకు ఇక్కడ చదును చేస్తున్నారు అని అడుగగా. ఒక్కసారిగా పై వారందరూ దళితులపై కర్రలు, రాళ్లతో దాడి చేస్తూ ఎవరు రా ఇక్కడ విగ్రహము మిమ్మలను పెట్టమనింది మాల లంజా కొడుకులారా అని తిడుతూ తక్షణమే ఇక్కడి నుంచి ఖాళీ చేయకపోతే ఇక్కడనే మిమ్మల్ని చంపి పాతి పెడతామని కులం పేరుతో దూషిస్తూ విచక్షణ రహితంగా వారిపై దాడి చేసి తలలకు శరీర భాగాలకు రక్త గాయాలు అయ్యే విధంగా చితకబాదారు. ఈ విషయమై బాధితులు మదనపల్లె పోలీస్ అధికారులను కలవగా అక్కడ ఎటువంటి న్యాయము జరగకపోగా బాధితులనే అవమానకరంగా మాట్లాడి బాధపెట్టినారు, ఈ విషయాన్ని బహుజన సమాజ్ పార్టీ తరఫున ఖండిస్తూ.. బాధితులకు తక్షణం న్యాయం చేయాలని, బాధితులను అవమానపరిచిన పోలీసుపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని, నిందితులను అరెస్టు చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దళితులకు న్యాయం చేయవలసినదిగా.. ఎస్పీ ని కలిసి, వినతి పత్రాన్ని అందజేసి, డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ మహేష్ బాబు, మదనపల్లి నాయకులు ఎం ప్రశాంత్, బహుజన నాయకులు నరసింహులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని పాతబస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాలమహానాడు కడప జిల్లా అధ్యక్షులు జేష్టాది భాస్కర్ ఆధ్వర్యంలో వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం అని ఆందోళన చేపట్టారు. తప్పుడు నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన ఏకసభ్య కమీషన్ రాజీవ్ మిశ్రా 2011 జనాభా లెక్కల ప్రకారం నివేదిక తయారు చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వడం చాలా దుర్మార్గ చర్య అని, దీనిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్షుణ్ణంగా పరిశీలన చేయాలని కోరారు. మాలలపై పక్షపాతం చూపకూడదని తెలియజేస్తున్నామని, 2025 జనాభా లెక్కల ప్రకారం ఏపీ మాలలు ఎంతమంది ఉన్నారు, ఎస్సీ మాదిగ సోదరులు ఎంతమంది ఉన్నారు తేల్చాల్సిన అవసరం ఉందని అన్నారు. దాన్ని బట్టి చూస్తే పర్సంటేజ్ అనేది ఎవరికి ఎక్కువ ఎవరికి తక్కువ అనేది నిర్ధారణ జరుగుతుందని దీనిని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్రి లక్ష్మయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడెం చెరువు సంపత్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాలల పరిరక్షణ పందిటి మోహన్, కడప జిల్లా అధ్యక్షులు హ్యూమాన్ రైట్స్ మేకల వెంకటన్న, శ్రీపతి భాస్కర్, దళిత సైన్యం మూటకట్ల ఆశీర్వాదం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షులు జె.పవన్ సాత్రి, శేఖర్, రాబర్ట్ కుమార్ పాల్గొన్నారు.

చుట్టూ నీరు ఉన్నా..గుక్కెడు నీటి కోసం తప్పని తిప్పలు

విశాలాంధ్ర-కొండాపురం: మండలంలో గండికోట ప్రాజెక్ట్ నిర్వాసితులకు ప్రభుత్వం పునరావాస కాలనీలు ఏర్పాటుచేయడం జరిగింది. ఇందులో భాగంగా కొండాపురంనకు సంబంధించిన ఎస్సీ కాలనీ మరియు పాత కొండాపురం గ్రామనకు స్థానిక రాఘవేంద్ర స్వామి కళ్యాణ మండపం వద్ద ఏర్పాటుచేసిన పునరావాసా కాలనీలలో నీటి సమస్య తీవ్రంగా ఉండటంతో ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని ఈ విశయంపై అధికారులకు విన్నవించిన ఫలితం లేదని సీపీఐ మండల కార్యదర్శి మనోహర్ బాబు, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, పి.వెంకటరమణల ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ గండికోట ప్రాజెక్టు నిర్మాణం వల్ల లక్షలాది కుటుంబాలకు త్రాగునీరు, సాగునీరు అందుతుందనే ఉద్దేశంతో ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వస్వం కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కాలనీలలో కనీస అవసరాలు అయినా మంచినీటిని అందించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టూ నీరు ఉన్నా కనీసం గుక్కెడు నీటి కోసం నిర్వాసిత ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని వివరించారు. వేసవి కాలం ప్రారంభ దశలోనే వారానికి ఒకసారి మాత్రమే నీరు వస్తుందని పేర్కొన్నారు. రాబోయే నీటి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కొండాపురం పంచాయతీ కార్యదర్శి షేర్వానికి వినతిపత్రం అందజేశారు.

ఎంఆర్‌పిఎస్ జెండా ఆవిష్కరణ స్థలం పరిశీలన

విశాలాంధ్ర- పీలేరు : పీలేరు నియోజకవర్గం, కె వి పల్లి మండలం గర్నిమిట్ట కేంద్రం లో గత కొన్ని సంవత్సరాలుగా అభినవ అంబేద్కర్, మహజన నేత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వం లో ఎం ఆర్ పి ఎస్ జెండా ఆవిష్కరణ జరుగుతోందని ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ మాదిగ స్పష్టం చేశారు మంగళవారం మహజన నేత మందకృష్ణ మాదిగ నాయకత్వం లో పనిచేసే ఎం ఆర్ పి ఎస్ నాయకులు జండా ఉన్న స్థలాన్ని పరిశీలించి స్థానిక రెవిన్యూ, పోలీస్ డిపార్ట్మెంట్ వారితో స్థలం గురించి చర్చించడం జరిగింది. అదేవిధంగా ఎం ఆర్ పి ఎస్ ఉద్యమానికి సంబంధం లేని కొంత మంది ఎం ఆర్ పి ఎస్ పేరు చెప్పు కుంటూ స్థానిక అధికారులను కలుస్తున్న నేపథ్యంలో అటువంటి వారికి మందకృష్ణ మాదిగ ఎం ఆర్ పి ఎస్ ఉద్యమానికి ఎటువంటి సంబంధం లేదని, వారు చేసే ఎటువంటి కార్యాచరణ అయినా బాధ్యత వహించదని.. అటువంటి వారి పై డిపార్ట్మెంట్ వారు ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకున్నా మందకృష్ణ మాదిగ నాయకత్వం ఎటువంటి భాధ్యతవహించదని తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు పీలేరు నియోజకవర్గం ఇన్చార్జి గండికోట వెంకటేష్, ఎం ఎస్ పి కేవీ పల్లి మండలం ఇన్చార్జి దొడ్డి వెంకటాచలపతి, ఎం ఆర్ పి ఎస్ మండల ఇన్చార్జ్ సందిపోగుల రాము, ఎం ఎస్ పి, ఎం ఆర్ పి ఎస్ నాయకులు ఆదినారాయణ, విజయ విజయ్ భాస్కర, రాజేష్, వెంకటరమణ, ఎం ఈ ఎఫ్ నాయకులు అంజి, శ్రీరాములు, వీరాంజి,యువ నాయకులు భాస్కర, అంజి, పృధ్వీరాజ్‌పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తిని పరామర్శించిన నాయకులు

విశాలాంధ్ర- రామాపురం : మండలంలోని చిట్లూరు పంచాయతీ హరిజనవాడ చెందిన చిట్లూరు శివ శంకర్ పెయింట్ పని చేస్తూ మంగళవారం ప్రమాదంలో గాయపడ్డారు. గాయపడిన వ్యక్తి చికిత్స కోసం సహాయముతో కడప రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మండల టిడిపి నాయకులు గాలివీటి సురేంద్ర రెడ్డి నాగి రెడ్డి. దేవ దర్శన్ రెడ్డి. చికిత్స పొందుతున్న శివశంకర్‌ను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే కోలుకోవాలని వారు ఆకాశించారు.

రామకృష్ణ కుటుంబానికి టిడిపి నాయకుల అండ

ఆర్.జె.వెంకటేష్ ఆధ్వర్యంలో రూ.50 వేలు ఆర్థికసాయం

విశాలాంధ్ర-మదనపల్లె: పుంగనూరు నియోజకవర్గం, చంద్రమా కులపల్లి పంచాయతీ,కృష్ణాపురానికి చెందిన టిడిపి కార్యకర్త రామకృష్ణ వైసిపి కార్యకర్త అయిన వెంకటరమణ చేతిలో దారుణహత్యకు గురయ్యారు.ఈ ఘటన ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.ఈ నేపథ్యంలో రామకృష్ణ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ నాయకులు అండగా నిలిచారు.హత్యకు గురైన రామకృష్ణ కుమారుడు సురేష్ ని మంగళవారం మదనపల్లి పట్టణం,నిమ్మనపల్లి సర్కిల్ నందు గల టిడిపి కార్యాలయానికి పిలిపించి టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ ఆధ్వర్యంలో రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.ఇందులో ఆర్.జె.వెంకటేష్ రూ.10 వేలు,పి.సతీష్ కుమార్ రూ.10 వేలు,చంద్రారెడ్డి రూ.5 వేలు,రమేష్ రూ.5 వేలు,మరికొంత మంది రూ.20 వేలు మొత్తం రూ.50 వేలు పోగు చేసి అందించారు.ఈ సందర్భంగా ఆర్.జె.వెంకటేష్ మాట్లాడుతూ టిడిపి సానుభూతిపరుడైన రామకృష్ణను వైసిపి నాయకుడు పట్టపగలే కొడవలితో హత్య చేయడం పాశవిక చర్య అన్నారు.టిడిపికి కోటిమంది కార్యకర్తలు ఉన్నారని,ఎవరికైనా ఇలాంటి ఆపద వచ్చినప్పుడు ఆదుకోవడానికి టిడిపి నాయకులు ముందుంటారన్నారు.ఇక మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ప్రోద్బలంతోనే పుంగనూరు నియోజకవర్గంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు ఇటువంటి దురాగతాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.ఇక వైసిపి నాయకులు ఈ హత్యకు,పెద్దిరెడ్డి కుటుంబానికి ఎటువంటి సంబంధం లేదని,ఇది వ్యక్తిగత కక్షలతో జరిగిందేనని చెప్పడం సిగ్గుచేటన్నారు.హంతకుడు వెంకటరమణ స్వయంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డితో దిగిన ఫోటోలు ఉండే విషయం మీకు తెలియదా అని విమర్శించారు.టిడిపి నాయకులు,కార్యకర్తలు సహనాన్ని చేతకానితనంగా భావించవద్దని, ఇవి ప్రతీకార దాడులకు దారి తీస్తే పరిస్థితులు వేరుగా ఉంటాయని ఆయన హెచ్చరించారు.ఇప్పటికైనా ఇలాంటి హత్య రాజకీయాలకు స్వస్తి పలికి ప్రశాంతమైన వాతావరణానికి సహకరించాలని ఆయన హితవు పలికారు.ఈ హత్య వెనుక ఉన్న ఎవరిని వదిలిపెట్టబోమని,చివరికి సీఐ,ఎస్.ఐలని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.ఇక రామకృష్ణ కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు వస్తున్న టిడిపి శ్రేణులను ఆయన అభినందించారు. అదేవిధంగా ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలనుకునేవారు రామకృష్ణ కుమారులైన కె.సురేష్ 7013742236,కె.శివ శంకర్ 8074956203 అనే నెంబర్లకు ఫోన్ పే,గూగుల్ పే ద్వారా సాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాటకొండ మధుబాబు, వెంకటరమణ, పెరవలి మధు,నరసింహారెడ్డి,గండికోట గణేష్ బాబు, రాజన్న, చెంగారెడ్డి, యల్లారెడ్డి,రమణ పాల్గొన్నారు.

దేశభక్తికి, సేవాభావానికి ప్రతీక స్కౌట్స్

విశాలాంధ్ర-మదనపల్లె: అన్ని రకాల ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో స్కౌట్ యూనిట్ ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి అన్నారు. మదనపల్లి పట్టణం జి ఆర్ టి స్కూల్ నందు మంగళవారం ఉదయం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ లీడర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ స్కౌట్ నందు ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలను మార్చి 31వ తేదీ లోపల ఆన్లైన్ పోర్టల్ నందు నమోదు చేయాలన్నారు. పాఠశాలల్లో నిర్వహించవలసిన స్కౌట్ కార్యకలాపాల గురించి వారికి అవగాహన కలిగించారు. విద్యార్థులలో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి స్కౌట్ శిక్షణ దోహదపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ సెక్రటరీ భాస్కర్ రెడ్డి, ఏ ఎస్ ఓ సి లక్ష్మీకర్, అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్స్ మహమ్మద్ ఖాన్, రవీంద్రారెడ్డి, స్కౌట్ కమ్యూనిటీ డెవలప్మెంట్ సభ్యులు లక్ష్మిరెడ్డి, స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టన్స్, కబ్ మాస్టర్స్, ఫ్లాక్ లీడర్స్ పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర-నందలూరు : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండల పరిధిలోని ఆయా గ్రామ సచివాలయాల నందు మార్చి నెలలో మూడు, నాలుగవ వారంలో నాలుగు రోజులు పాటు ఆధార్ క్యాంపు నిర్వహించాలని ఎంపీడీవో రాధాకృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ నుండి 22వ తేదీ వరకు నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సచివాలయం 1లో, 25వ తేదీ నుండి 28వ తేదీ వరకు నందలూరు సచివాలయం నందు ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 0 నుండి 5 సంవత్సరంల వారికి ఆధార్ కార్డు అప్డేట్ చేయుట, ఆధార్ కార్డు నందు చిరునామా, ఫోటో మార్పు చేయుట, ఆధార్ కార్డునకు ఫోన్ నెంబర్ లింక్ చేసుకొనుటకు, వేలిముద్రలు అప్డేట్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో కోరారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి:ఎంపిడివో

విశాలాంధ్ర-చెన్నూరు : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించినట్లయితే గ్రామాల అభివృద్ధి సాధించవచ్చని ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు అన్నారు. మంగళవారం మండలంలోని గుర్రంపాడు గ్రామపంచాయతీలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 7 గంటల నుండి ఈ ఓ పి ఆర్ డి సురేష్ బాబు తో కలిసి చెత్త సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్యం పై అవగాహన కలిగి ఉండాలని వారు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వారి ఇళ్లలోని చెత్త చెదారం వ్యర్థ పదార్థాలు ఇళ్ళ ముందు వేయవద్దని వాటిని హరిత రాయబారుల కు అందివాలన్నారు. ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నట్లయితే ఆ కుటుంబాలకు జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. అనంతరం హరిత రాయబారులతో కలిసి గ్రామంలో తిరిగి వీధులను శుభ్ర పరచడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించారు.

చలివేంద్రాలను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - జమ్మలమడుగు : జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని పాత బస్టాండ్ ఆవరణలో మరియు తాడిపత్రి రోడ్డు నందుగల అన్నా క్యాంటీన్ వద్ద చలివేంద్రాలను మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వేసవిలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో ప్రజలకు దాహం తీర్చేందుకు చలివేంద్రాలను మరిన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి,రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోక్సో చట్టం మొదలగు అంశాలపై సెన్సిటైజేషన్ అవగాహన

విశాలాంధ్ర - ఒంటిమిట్ట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, జి. శ్రీదేవి, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు ఒంటిమిట్ట నందుగల ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాల్ నందు "పోక్సో చట్టం మొదలగు అంశాలపై సెన్సిటైజేషన్ మరియు అవగాహన కార్యక్రమం" నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోక్సో చట్టం అంటే లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం, 2012, ఇది పిల్లలపై లైంగిక వేధింపులు, లైంగిక నేరాల నుండి రక్షణ కల్పించేందుకు ఉద్దేశించబడింది. ఈ చట్టం పిల్లలపై లైంగిక వేధింపులు, లైంగిక నేరాల నుండి రక్షణ కల్పించేందుకు, మరియు బాధితులకు మద్దతు ఇచ్చే వ్యవస్థను, నేరస్థులను పట్టుకోవడానికి మెరుగైన పద్ధతులను నిర్దేశిస్తుంది, 2012లో ఈ చట్టం ఆమోదించబడింది, ఎందుకంటే పిల్లలపై లైంగిక నేరాల సమస్యను సమగ్రంగా పరిష్కరించడానికి ఇది అవసరం అని ప్రభుత్వం భావించింది. న్యాయ ప్రక్రియ యొక్క ప్రతి దశలో పిల్లల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ చట్టం రూపొందించబడింది. 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలతో లైంగిక చర్యలన్నీ లైంగిక నేరంగా పరిగణించబడుతుందని చట్టం భావిస్తుంది. పోక్సో ఈ-బాక్స్:ఫిర్యాదులను నమోదు చేయడానికి జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ (ఎన్ సి పి సి ఆర్) యొక్క అధికారిక పోర్టల్ లో "పోక్సో ఈ బాక్స్" బటన్ ఉంది సద్వినియోగం చేసుకోగలరు, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి మనోహర్, ఒంటిమిట్ట మండలం మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారి కె ఆర్ ఎం ప్రసాద్, డిస్టిక్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నిత్యానంద రాజు, ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ టి బాబు, ఒంటిమిట్ట సబ్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్, అసిస్టెంట్ డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి, మహిళా పోలీ సులు, అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, పారా లీగల్ వాలంటరీలు, బాలరాజు శివరాజు. శ్రీదేవి. లీలావతి. ప్రతాప్ రెడ్డి కృష్ణయ్య పానల్ న్యాయవాదులు రామదాసు, ఎన్జీవోలు, మహిళలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

ఏడూర్ల మారెమ్మ జాతర

వైభవంగా నిర్వహించుకుందాం

విశాలాంధ్ర-నందలూరు : నాగిరెడ్డిపల్లి మేజర్ పంచాయతీ గ్రామదేవత ఏడూర్ల మారమ్మ జాతరను వైభవంగా నిర్వహించేందుకు అందరూ కలిసికట్టుగా ముందుకు సాగేందుకు సిద్ధం కావాలని మారమ్మ తల్లి ఆలయ ధర్మకర్తల మండలి పిలుపునిచ్చింది. సోమవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ధర్మకర్త మండలి ప్రతినిధులు మాట్లాడారు. నాగిరెడ్డిపల్లి మేజర్ పంచాయతీ గ్రామ దేవత అయిన శ్రీశ్రీశ్రీ మారమ్మ తల్లి గుడి ప్రాసస్యం పురాతనమైనదన్నారు. దాదాపు 1000 ఏళ్ల కిందట నే ఏడూరుల జాతరను ఘనంగా నిర్వహించే వారని మన పూర్వీకుల సమాచారం అన్నారు. నాగిరెడ్డిపల్లి గ్రామం పుట్టకముందు నుంచే అమ్మవారి ఆలయం వెలిసి ఉండేది అన్నారు. నారాయణరాజుపేట, అరవపల్లి, గొల్లపల్లి, నాగిరెడ్డిపల్లి, కుమ్మరపల్లి, ఇసుకపల్లి గ్రామాలకు చెందినవారు ఏకమై ఏడూర్ల మారమ్మ జాతరను నాగిరెడ్డిపల్లి శివారులో వెలిసిన మారమ్మ గుడి వద్ద అత్యంత వైభవంగా నిర్వహించేవారన్నారు. నారాయణరాజుపేటలో మాతమ్మ గుడి, గొల్లపల్లి లో గంగమ్మ గుడి తో పాటు చుట్టూ ప్రక్కల గ్రామాల లో కొలువైన గ్రామదేవతలు లకు కేంద్రం నాగిరెడ్డిపల్లి మారమ్మ ఆలయంగా బాసిల్లింది అన్నారు. అమ్మవారి ఆలయ చరిత్ర మండలానికి తలమానికి అన్నారు. ఆలయం ఇప్పటికే భక్తుల సహకారంతో అభివృద్ధి చెందిందన్నారు.అమ్మవారి ఆలయం స్థల సమస్యలు పరిష్కరించేందుకు అందరూ కలిసికట్టుగా ముందడుగు వేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

పీలేరు కార్పెంటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

ముస్లిం సోదరులకు ఇస్తారు విందు

విశాలాంధ్ర-పీలేరు:- రంజాన్ మాసంలో కార్పెంటర్ అసోసియేషన్ వాళ్లు ముస్లిం సోదరులకు ఇస్తారు విందు ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బహుజన బిల్డింగ్ యూనియన్ బిస్మిల్లా వెల్డర్ యూనియన్ మరియు బిస్మిల్లా ఆటో యూనియన్ పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు రెడ్డి బాబు కార్యదర్శి అంబికాపతి ఆచారి కోశాధికారి శంకరాచార్య గౌరవ సలహాదారుడు వేణు ఆచారి గౌరవ అధ్యక్షుడు మహబూబ్ బాషా ఫారుక్ భాషా మోదిన్ భాష గౌస్ పీర్ కమల్ భాష మునిరాజు షేక్ సుభాన్ భాష ఆటో మీద షేక్ అబిదుల్ల కార్వింగ్ రమేష్ సురేష్ ఆచారి శివాచారి కృష్ణమాచారి గంగాధర్ మధు గణపతి ఆచారి పాల్గొనడం జరిగింది.

వడదెబ్బపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-రాయచోటి: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వారి ఆదేశాల మేరకు రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులుకు హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ వడదెబ్బపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభం ఐనందున ఎండలు క్రమేపి పెరుగుతున్నందున విద్యార్థులకు ఒంటిపూట బడులు ప్రవేశపెట్టడం జరిగింది అన్నారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఇళ్ల లోపలే ఉండి హెూమ్ వర్క్ చేసుకోవడం, చదువు కోవడం లేదా నిద్ర పోవడం చేయాలన్నారు. ఎండలో క్రికెట్, కబాడీ, కోకో, వాలిబాల్ వంటి ఆటలు ఆడటం వల్ల ఎండ దెబ్బ కు గురి అయ్యే ప్రమాదం ఉంది. ఎక్కువగా జ్వరం, తలనొప్పి, నీరసం, కళ్ళు తిరుగుట, విరోచనాలు, వాంతులు, నోరు ఆరిపోవుట, అపస్మరక స్థితి లోకి వెళ్ళుట, కలవరింతలు వంటి లక్షణాలు ఉంటాయి. మజ్జిగ లేదా ఓఆర్ఎస్ తాగాలి. గాలి బాగా వచ్చే విదంగా ఫ్యాన్ కింద ఉంచాలి. వీలైతే మాట్లాడిస్తూ ఉండాలి. ఉదయం 11గం నుండి సాయంత్రం 4గం వరకూ బయటకు అత్యవసరం ఐతే తప్ప వెళ్ళరాదు. వెళ్ళవలసి వస్తే గొడుగు తీసు కెళ్ళాలి. గంట గంట కు నీరు ఒక గ్లాస్ త్రాగాలి, ఇంటిలో కిటికీలు తెరచి ఉంచాలి, నల్లని బట్టలు వేయరాదు, కద్దరు బట్టలు వదులుగా ఉన్నవి వేసుకోవాలి. దూర ప్రయానాలు చేయరాదు. గర్భవతులు, బాలింతలు, 10సంవత్సరాల లోపు పిల్లలు, అరవై సంవత్సరాల పైబడిన వారు చాలా జాగ్రత్తగా ఉండాలి అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎమ్ నిర్మల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయానికి ఏ సి వితరణ

విశాలాంధ్ర- పీలేరు : పీలేరు తెలుగు దేశం పార్టీ రాష్ట్ర బి సి కార్యదర్శి పురం రామ్మూర్తి పంచాయతీ కార్యాలయానికి ఏ సి వితరణ చేశారు.అదే విధంగా తెలుగుదేశం పార్టీ నాయకులు పోలిశెట్టి సురేంద్ర బీరువా వితరణ చేశారు. ఈ సందర్భంగా దాతలు పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర మాట్లాడుతూ కార్యాలయానికి నిత్యం వందలాది మంది ప్రజలు వస్తూపోతూ ఉంటారని, ఈవో కార్యాలయంలో కూర్చుని మాట్లాడుకుని వారి వారి పనులు చేసుకుంటూ వెళు తుంటారని అన్నారు వారికి సౌకర్యార్థం కార్యాలయంలో ఈ సమయంలో వేసవి దృష్ట్యా ప్రజలకు కాస్త ఉపశమనం కలుగుతుందని ఉద్దేశంతో ఈ వితరణ కార్యక్రమం చేపట్టామని ఇరువురు అన్నారు. పంచాయతీ ఈవో వై. గురు మోహన్ మాట్లాడుతూ నాయకులు, దాతలు కార్యాలయానికి ఏమి చేసినా అది ప్రజాసేవ కిందికే వస్తుందని ఆయన అన్నారు. పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర చేసిన వితరణ పరికరాలు భవిష్యత్తు తరాలకు కూడా మంచి జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షులు ఎన్ అమర్నాథ్ రెడ్డి, పీలేరు మండల తెలుగు యూత్ అధ్యక్షులు నల్లారి రియాజ్, ఏబీఎన్ రాజు,మనోహర. మాజీ ఉప సర్పంచ్ మహమ్మద్ పీర్, పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో పరిశుభ్రంగా ఉంచాలి

కలెక్టర్ ఆదేశాలతో గ్రామాలలో పర్యటించిన అధికారులు

విశాలాంధ్ర - బ్రహ్మంగారి మఠం : మండలంలోని ప్రతి గ్రామం అభివృద్ధి ప్రతి గ్రామంలో పారిశుద్ధం లోపించకుండా గ్రామాలు శుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు మండల అభివృద్ధి అధికారి వెంగముని రెడ్డి పేర్కొన్నారు. రేకలకుంట పంచాయతీలో పరిటించి గ్రామాలలో రోడ్లపై వచ్చిన మురికి నీళ్లు తొలగించే విధంగా పంచాయతీ కార్మికుల చేత శుభ్రత పనులను చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టిందని అందులో భాగంగానే ప్రతి గ్రామం శుభ్రంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు గ్రామాలలో పర్యటించడం జరిగిందని ఆ గ్రామంలో శానిటేషన్ చెత్త సేకరణ డ్రైనేజ్ కాలువలు కూడికను తీసివేసి పరిశుభ్రంగా ఉంచేందుకు పరిశుభ్రంగా ఉన్నప్పుడు ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అపరిశుభ్రంగా చెత్తాచెదారం రోడ్లపై వేయడంతో ప్రజలే అనారోగ్యానికి గురవుతారని ప్రతి ఒక్కరు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకునే విధంగా చూడాలని ప్రజలకు గ్రామస్తులకు పల్కు సూచనలను అందించారు. అదేవిధంగా గ్రామాలలో తాగునీటి సమస్యలు లేకుండా చూసేందుకు అన్ని విధాల చర్యలను తీసుకుంటున్నామని వారు చేసింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇన్చార్జి, విస్తరణ అధికారి ఈవోపీఆర్డి సురేష్ బాబు, ఎంపీడీవో ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి రవీంద్రబాబు సచివాలయం కార్మిక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర -కలికిరి: మహాత్మ జ్యోతిరావు పూలే ఏపీ వెనుకబడిన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మరియు జిల్లా కన్వీనర్ వై సోమశేఖర్ మాట్లాడుతూ .. 20 25 - 20 26 విద్యా సంవత్సరానికి విద్యా సంవత్సరానికి గాను జూనియర్ ఇంటర్మీడియట్ మరియు, 5 వతరగతి మరియు ,బ్యాక్ లాక్ తరగతులలో చేరడానికి దరఖాస్తుల గడువు ఈనెల 25వ తేదీ వరకు పొడిగించడం అయినదని అన్నారు. అంతే కాకుండా ఉమ్మడి చిత్తూరు జిల్లా లో సదుం, అయితే పల్లి ,తంబాలపల్లి, కుప్పం ,సత్యవేడు, మండలాలలో బాలురకు సంబంధించిన గురుకుల పాఠశాలలో కలవని ,కలికిరి ,పీలేరు ,ఉదయ మాణిక్యం, పెద్దపంజాణి,, పులిచెర్ల,మండలాలకు బాలికలకు సంబంధించిన గురుకుల పాఠశాలలో కలవని అన్నారు ,అదేవిధంగా జూనియర్ ఇంటర్మీడియట్ కు దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు 4-5 -20 25 వ తేదీన 5 వ తరగతిలో చేరునున్న విద్యార్థులకు 27న, బ్యాక్లాగ్ తరగతులలో చేరుటకు ఏప్రెల్ 28వతేదీన ప్రవేశ పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులను కోరుచున్నామని విద్యార్థులు తప్పకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు, ఇంకా ఏమైనా పూర్తి సమాచారం కోసం 90 00715637. 8790092069, ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి పూర్తి సమాచారాన్ని తెలుసుకోగలరని ప్రిన్సిపాల్ తెలిపారు.

స్వర్ణాంధ్రపై బాబు, మోదీ వ్యాఖ్యలు విడ్డూరం: తులసిరెడ్డి



విశాలాంధ్ర-వేంపల్లి: స్వర్ణాంధ్ర 2047 గురించి ముఖ్య మంత్రి చంద్రబాబు, అలాగే వికసిత భారత్ 2047 గురించి ప్రధాన మంత్రి మోదీలు చేసిన వ్యాఖ్యలు విడ్డూరమని మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు చంద్రబాబు ఇటు మోదీ ఈ అంశంపై పదేపదే చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇది పిచ్చి తుగ్లక్ ఆలోచన అన్నారు. ఇద్దరూ ఫూల్స్ పారడైజ్ లో,మూరు?ల స్వర్గ లోకం లో విహరించినట్లుందన్నారు. 2047 అంటే ఇంకా 22 సంవత్సరాలు.అప్పటికి ఎవరం వుంటామో,ఎవరం వుండమో తెలియదని .ఏ పార్టీ వుంటుందో,ఏ పార్టీ కాలగర్భంలో కలిసిపోతుందో తెలియదన్నారు. ప్రజలు అధికారం అప్పగించింది 2029 వరకు. కాబట్టి 2029 నాటికి ఏమి చేస్తారో చెబితే సమంజసంగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా ప్రధాన మంత్రి,ముఖ్య మంత్రి నేల విడిచి సాము చేయడం మానుకుంటే మంచిదని హితవు పలికారు.

కడప జిల్లా పేరు మార్పు హర్షణీయం

వైఎస్సార్ జిల్లా స్థానంలో వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మార్పు చేయడం హర్షణీయమని డాక్టర్ తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ క్రీస్తు శకం 1808 లో కడప జిల్లా ఏర్పడిందన్నారు. 1812 వరకు సిద్ధవటం జిల్లా కేంద్రంగా ఉండేదన్నారు. 1812 నుంచి నేటి వరకు కడప జిల్లా కేంద్రంగా ఉందని, కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి నిలయమైన తిరుమలకు తొలి గడప దేవుని కడప అని అందువల్ల కడప జిల్లా అని పేరు వచ్చినట్లు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం 2010 జులై 8 న ఆయన జ్ఞాపకార్థం వైఎస్సార్ జిల్లా గా పేరు మార్చడం జరిగిందన్నారు. వైయస్సార్ జిల్లాగా కాకుండా వైఎస్సార్ కడప జిల్లా గా పేరు పెడితే సమంజసంగా ఉంటుందని,అటు రాజశేఖర్ రెడ్డి జ్ఞాపకార్థం,ఇటు తిరుమల వేంకటేశ్వర స్వామి గుర్తుగా ఉభయ తారకంగా ఉంటుందని జిల్లా ప్రజలు అనేకమంది ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారన్నారు. ఈ అంశం మీద జిల్లా కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం కూడా జరిగిందన్నారు. నెల్లూరు జిల్లాకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా, కోనసీమ జిల్లాకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాగా నామకరణము చేసినట్లు వైఎస్సార్ జిల్లాకు కూడా వైఎస్సార్ కడప జిల్లాగా పేరు పెట్టమని తీర్మానించడం జరిగిందన్నారు.

ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

జిల్లా అధ్యక్షులు గాలి చంద్ర

విశాలాంధ్ర -రాజంపేట: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 28వ తేదీన ఢిల్లీలో జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అన్నమయ్య జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాలి చంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని ఆర్ అండ్ బి బంగ్లా వద్ద కార్మికులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన మరియు నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికై ఆలిండియా భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. దేశవ్యాప్తంగా భవన నిర్మాణ రంగ కార్మికుల్లో సంక్షేమం కోసం పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996 ను అమలు చేయడంలో వివిధ రాష్ట్రాల్లో చాలా లోపాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నిధులను మళ్లించి కార్మికులు తీవ్ర నష్టం కలిగించిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మిక సంక్షేమ బోర్డు ని అమలు చేస్తామని,ఇప్పటికే పెండింగ్లో ఉన్న 42 వేల క్లైమూలను కార్మికులకు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్న నేటికీ కూడా సమస్య పరిష్కారానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు అన్నారు.వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సంబంధించి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంతో పాటు బోర్డు ద్వారా కార్మిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సంక్షేమ బోర్డు ద్వారా స్కీములు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి సికిందర్, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉండేవారు ఐశ్వర్యవంతులు

విశాలాంధ్ర-రాయచోటి: ప్రస్తుత సమాజంలోని ప్రజలు ఆరోగ్యంగా ఉండే వారే ఐశ్వర్యవంతులని వీరబల్లి మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మనీషా అన్నారు. వీరబల్లి మండలం మట్లి పంచాయితీ పెద్దూరులో మంగళవారం ప్రజా చైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధి అవగాహన, పరీక్షలు నిర్వహణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యానికి అనేక పథకాలు అమలు చేస్తుందని, వాటిని సక్రమమైన రీతిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజా చైతన్య సేవా సంఘం ప్రాజెక్టు మేనేజర్ టి.స్వాతి మాట్లాడుతూ తమ సంస్థ ఎయిడ్స్ వ్యాధి నివారణకు అనేక ప్రజా చైతన్య కార్యక్రమాలు వైద్య శిబిరాలు, రక్త పరీక్షలు, వ్యాధిగ్రస్తులకు పలు రకాల మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎఫ్ డిపి కోఆర్డినేటర్ రాజు, ఏఎన్ఎం జ్యోతి, డిఇఓ మోహన్, ఆశా కార్యకర్తలు, ప్రజా చైతన్య సేవా సంఘం ఏఎన్ఎం నాగరాణి, ఓఆర్ డబ్ల్యు చంద్రకళ, సుహాసిని, పిఈ శ్రీకళ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రక్త పరీక్షలు చేసి, పలు రకాల వ్యాధులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

మత్తు పదార్థాల వినియోగంపై ర్యాలీ

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లి మండలం ఇడుపులపాయ ట్రిపుల్ఐటీ కళాశాలలో డ్రగ్స్ వినియోగంపై సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వినియోగం వాటి వల్ల ఎదురయ్యే దుష్ప్రరిణాలు తదితర అంశాలను అధికారులు వెల్లడించారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యమని వారు పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేశారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గ ఎన్నిక

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లె మండలంలో పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గ ఎన్నిక మంగళవారం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో .కులాయమ్మ ఈవో(పిఆర్ మల్లికార్జున రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నిక శుభ పరిణామన్నారు. ఈ సందర్భంగా నందిపల్లి గ్రామపంచాయతీ చరణ్ కుమార్ మాట్లాడుతూ గౌరవ అధ్యక్షులుగా రాఘవేంద్ర, ఉపాధ్యక్షులుగా వీరాంజనేయులు, మహిళా ఉపాధ్యక్షురాలుగా గౌరీ ,కోశాధికారిగా రుషికేశ్వర,జనరల్ సెక్రటరీగా నసరయ్య, అదనపు సెక్రటరీగా మహేష్, గౌరవ సలహాదారులుగా లలిత,అనిల్ కుమార్, లక్ష్మమ్మయ్య, కార్యనిర్వాహక సభ్యులుగా నాగార్జున,వెంకట చరణ్ కుమార్ ,శ్రీలత,లలిత, వరప్రసాద్,కొండయ్యగా ఎన్నిక అయ్యారు. అనంతరం అధ్యక్షులుగా ఎన్నికైన రాఘవేంద్ర మాట్లాడుతూ నాకు ఈ అవకాశం ఇచ్చిన కార్యదర్శి లందరికి పేరుపేరునా అభినందనలు తెలిపారు.సమైక్యంగా ఉండి ప్రతి ఒక్కరికి సమన్యాయం చేయడమే తమ లక్ష్యం అన్నారు. ప్రస్తుతం అనేక రకాల సర్వేలతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు, పంచాయతీ కార్యదర్శులకు పని భారం నుంచి విడుదల కలిగేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలోని అందరూ పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 1 ఉద్యోగులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్పును ఆ పార్టీ నాయకులు స్వాగతించాలి

మహానాడును పండుగలా నిర్వహిస్తాం

టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : గత వైసీపీ ప్రభుత్వంలో కడప జిల్లాను, వైయస్సార్ జిల్లాగా మార్పు చేయడాన్ని, వ్యతిరేకిస్తూ చాలామంది ఫిర్యాదులు చేయడంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో క్యాబినెట్ సమావేశంలో వైఎస్సార్ కడప జిల్లాగా నిర్ణయించడం జరిగిందని, జిల్లా పేరు మార్పును అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు స్వాగతిస్తున్నాయని, వైసీపీ నాయకులు స్వాగతించాలని టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ద్వారకా నగర్‌లో ఆయన నివాసంలో మంగళ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప జిల్లాకు 300 సంవత్సరాల చరిత్ర ఉందని, పుణ్యక్షేత్రాలు, నదులు, పాపికొండలు, దేవుని గడపగా కడప జిల్లా ఎంతో ప్రసిద్ధి గాన్చిందని చెప్పారు. వైయస్సార్ కడప జిల్లాగా పేరు మార్పుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియ చేస్తున్నానన్నారు. అమరజీవి ఆత్మార్పణతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని, నెల్లూరు జిల్లాను, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా పేరు మార్చారే గాని, పేరులో నెల్లూరును తొలగించలేదని చెప్పారు. ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభివృద్ధి చేశారు కాబట్టే, జిల్లాకు ఆయన పేరును అలాగే ఉంచారని అన్నారు.మే నెలలో నిర్వహించే టిడిపి మహానాడు కార్యక్రమాన్ని పండుగలా నిర్వహిస్తామని, త్వరలో మేము మహానాడు నిర్వహించేందుకు నాలుగు చోట్ల స్థలాలు పరిశీలించామని ఆ స్థలాలను మహానాడు కమిటీ పరిశీలన చేసి, ఎక్కడువున్నది నిర్ణయిస్తుందన్నారు.

నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని కలిసిన నాయకులు

విశాలాంధ్ర-కలికిరి: మంగళవారం నగిరిపల్లి క్రాస్ దగ్గర ఉన్న బిజెపి కార్యాలయం లో పలువురు పార్టీ నాయకులు ఏపీ ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి , బిజెపి నాయకులు , కిరణ్ కుమార్ రెడ్డిని పలువురు పార్టీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులను, అభిమానులను ప్రజలను ఆప్యాయంగా పేరుపేరునా పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగళూరు నుండి రోడ్డు మార్గాన కలికిరికి సోమవారం వచ్చారు. నగిరిపల్లి గ్రామంలో జరుగుతున్న తమ నూతన గృహ నిర్మాణ పనులను చూడడం జరిగినదని అందులో భాగంగా కొన్ని ముఖ్యమైన పనులను కూడా చూసుకొని మంగళవారం మధ్యాహ్నం తిరిగి తిరుపతి నుండి హైదరాబాద్‌కు వెళ్లడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఏ కృష్ణప్ప, కృష్ణారెడ్డి రెడ్డప్ప రెడ్డి ,జగదీష్, బిజెపి జిల్లా నాయకులు నరేంద్ర కుమార్ రెడ్డి ,పురుషోత్తం ,జయరాం ,పోలీస్ సిబ్బంది ,ఇతర నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-కడప రూరల్ : ముందస్తు అడ్మిషన్స్ పేరుతో విద్యార్థి తల్లిదండ్రుల దగ్గర నుండి లక్షల రూపాయలు వసూల్ చేస్తున్నటువంటి కార్పొరేట్ విద్యాసంస్థల పైన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు అఖిరానందన్ డిమాండ్ చేశారు. కడప నందు హెూచిమిన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చైతన్య,నారాయణ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్స్ పేరుతో లక్షల రూపాయలు విద్యార్థి తల్లిదండ్రుల దగ్గర నుండి ముక్కు పిండి వసూలు చేస్తున్నారన్నారు. అడ్మిషన్ ఫీజు, బుక్స్ ఫీజు, హాస్టల్ ఫీజు, పాకెట్ మనీ ఫీజు, యూనిఫామ్ ఫీజు, స్కూల్/ కాలేజ్ ఫీజు, ఇతరేతర ఫీజులతో విద్యార్థి తల్లిదండ్రుల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నారన్నారు. గ్రామాల్లో తమకు ఉన్నటువంటి పొలాలను సైతం అమ్ముకొని వీరికి లక్షల రూపాయలు ధారపోస్తే, చివరికి అర్హత లేని ఉపాధ్యాయులచే విద్య బోధన చేసి ఉపాధ్యాయులు చెప్పినటువంటివి విద్యార్థులకు అర్థం కాక పరీక్షలు ఫెయిల్ అయితే తమ తల్లిదండ్రులకు మొహం చూపించలేని విద్యార్థులు ఎక్కువ ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుని, శవాలుగా మారి ఇంటికి తిరిగి వస్తున్నారు. కన్న తల్లిదండ్రులకు తీవ్ర గర్భకోషను మిగిల్చుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్రవ్యాప్తంగా చైతన్య,నారాయణ విద్యాసంస్థల అక్రమ అడ్మిషన్స్‌ను, ఫీజుల దోపిడీని అరికట్టాలని అదే విధంగా విద్యార్థులు ఒత్తిడికి గురి అయి ఆత్మహత్యల పాలు కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా చైతన్య, నారాయణ విద్యాసంస్థల ముందు ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు రాజేష్, అరుణ్ పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరం

జోన్-4 క్రీడల్లో శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ

విశాలాంధ్ర -రాజంపేట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఏజీఎం రమణయ్య, ప్రిన్సిపాల్ ఆకేపాటి సుధాకర్ రెడ్డి అన్నారు. ఇటీవల రాయచోటిలో శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత బిఎస్ రావు మెమోరియల్ ట్రస్ట్ తరఫున జోనల్-4 క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో రాజంపేట పట్టణ కేంద్రంలోని ఆర్ఎస్ రోడ్డు ల ఉన్నటువంటి శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి క్రీడల్లో రాణించారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆకేపాటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రాజంపేట బ్రాంచ్-2 తరఫున క్రీడా పోటీలలో పాల్గొన్న విద్యార్థులు వాలీబాల్, టెన్నిస్, త్రో బాల్, క్రికెట్, పరుగులు పందెం పోటీలలో పాల్గొని బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించి అభినందించారు. విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకొని క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు చంద్ర, షాబు విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టిపెళ్లలు విరిగిపడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లె మండలం కత్తలూరు గ్రామ సమీపంలో ఓ గనిలో మట్టిపెళ్లలు విరిగిపడి అమ్మయ్యగారిపల్లెకు చెందిన చిట్టిబోయిన రామచంద్ర అను వ్యక్తి మృతి చెందారు. ముగ్గురాళ్ల గనిలో పనిచేస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మట్టిలో కూరుకుపోయిన రామచంద్రను కూలీలు వెలికి తీశారు. అప్పటికే రామచంద్ర మృతి చెందినట్లు కూలీలు వెల్లడించారు.

పనిచేయని కంప్యూటర్లు -అవస్థలు పడుతున్న సిబ్బంది

సచివాలయంలో అట ఎక్కించిన కంప్యూటర్స్

విశాలాంధ్ర -బ్రహ్మంగారి మఠం : మండల పరిధిలోని గ్రామ సచివాలయంలోనే ప్రభుత్వం అందించిన కంప్యూటర్లను మండలంలోని సోమిరెడ్డిపల్లె సచివాలయాల్లో పనిచేయక మూల బడిన కంప్యూటర్స్ అవస్థలో సచివాలయం సిబ్బంది. ఒకటి రెండు మినహాయింపు తప్ప కంప్యూటర్లు పూర్తిస్థాయిలో పని చేయక పోవడం సిబ్బంది మాత్రం ఉన్న వాటితోనే ప్రజలకు పనులు చేసి పంపిస్తున్నారు. కంప్యూటర్లు మాత్రం ఐదు సంవత్సరాలు మాత్రమే పనిచేస్తున్నాయని ప్రస్తుతం అన్ని సచివాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఒక్కొక్క సచివాలయంలో సిబ్బంది అన్ని శాఖల అధికారులు ఉన్నారని ప్రజల పని చేసేందుకు కంప్యూటర్‌లు పనిచేయకపోవడంతోనే అరకొర కంప్యూటర్తోనే కాలం గడుపుకుంటూ వస్తున్నారు. సచివాలయం ఒకటి ఆన్ లైన్ ద్వారా పనులు చేయడం జరుగుతుంది. కానీ కంప్యూటర్లు మాత్రం పనిచేయకపోవడంతో కొంతమంది సిబ్బంది వారి సొంత లాప్టాప్ ద్వారా ప్రజలకు పనులు చేస్తూ నెట్టకొస్తున్నారు. కొన్ని సచివాలయంలో కూడా ఫర్నిచర్స్ కొరత ఉన్నాయని ప్రజలతో సమావేశాలు నిర్ణయించుకోవాలన్నా సప్లయర్స్ ద్వారా తెప్పించుకోవడం ప్రజలతో సమావేశాలను నిర్వహిస్తున్నారు. పంచాయతీ నిధులు కొరత వల్లనే సమస్యలు తప్పడం లేదు అధికారులు చెప్తున్నారు. ప్రజలకు పారిశుద్ధం పనులకు కావలసిన మెటీరియల్ బ్లీచింగ్, పొరకల కూడా కొనాలన్న నిధులు కొరత ఉన్నాయని అధికారులు తెలుపుతున్నారని కొన్ని పంచాయతీల్లో ఒకటో తేదీ పింఛన్ పంపిణీకి డిపిడిలు కూడా పనిచేయకపోవడం వృద్ధుల పింఛన్లు పంపిణీ చేయాలన్న వారి ఫింగర్ ప్రింట్స్ తీసుకోవాలన్నా డి పి డి లు రిపేరింగ్ ఖర్చు కూడా లేకపోవడం గ్రామాలలో తాగునీటి పైపులు పగిలి వాటి రిపేర్ ఖర్చులు కూడా అధికారులు పట్టించుక ోకపోవడం మార్చి బడ్జెట్లో నిధులు పూర్తిచేయాలని పై సంబంధిం చిన అధికారికి ఆదేశాలు ఇచ్చిన అధికారి సీతయ్య లాగా వ్యవహరిస్తున్నారని పలువులు ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికా రులపై అధికారి ఆదేశాలు ఇచ్చిన విషయంలో అధికారులు కొంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సిబ్బంది జీతాలు కూడా అందించలేక పోతున్నారని మేయర్ పంచాయ తీలలో మంచిని వరకు మోటర్లు రిపేర్ కూడా చేయిం చేందుకు అధికార చేతి నుండి సొంత ఖర్చులతో రిపేర్లు చేయిస్తు న్నారు. కొంత ఇంటి పన్ను వల్ల కొన్ని కొన్ని పంచాయితీలో మెయింటింగును చేస్తూ వస్తున్నారు కంప్యూటర్ పేపర్స్ కూడా కొనేందుకు అవస్థలు పడుతున్నారని సిబ్బంది తెలుపుతున్నారు.

రంజాన్ మాసంలో పేద ప్రజలకు

దానధర్మాలు చేయడంతో పుణ్యం లభిస్తుంది

వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత సుభాన్ భాష

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఆయన కార్యాలయంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ప్రతి సంవత్సరం లాగే 21వ డివిజన్ 30 డివిజన్ లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ప్రతి సంవత్సరం లాగే దుస్తులను, నగదును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సుభాన్ భాషా మాట్లాడుతూ రంజాన్ మాసంలో కుల మతాలకతీతంగా ప్రతి పేదవాడికి సాయం చేయాలని స్ఫూర్తితో ప్రతి ముస్లిం ముందుకు సాగాలని అలాగే కష్టాల్లో ఉన్న ప్రతి వ్యక్తిని సాయం చేయాలని అలాగే పేదవాడి ఆకలి దప్పికలను తెలుసుకొని సాయం అందించాలని పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష చేస్తూ పేదల కష్టాలను తెలుసుకుని సహాయం అందిస్తే ఆ దేవుడు మనకు అండగా ఉంటాడని ప్రతి సంవ త్సరం లాగే పారిశుద్ధ్య కార్మికులకు చేయూత నిస్తున్నామని ఆయన వెల్లడించారు 21,30 డివిజన్లో మసీదుల వద్ద పారిశుద్ధ్య కార్మికులు అందుబాటులో ఉండి పరిశుద్ధ పనులు చేపట్ట డం ఎంతో సంతోషదగ్గ విషయం అన్నారు దాదాపు కొన్ని సం వత్సరాల నుంచి ఈ సంప్రదాయాన్ని పాటిస్తూ పేదలకు సాయం చేసే విధంగా అల్లా ఆజ్ఞతో ముందుకు సాగుతున్నాన న్నారు.

కడప జిల్లా పేరు మార్పుపై హర్షం

విశాలాంధ్ర-వేంపల్లి: వైస్సార్ జిల్లాను వైస్సార్ కడప జిల్లా గా మారుస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు సూగురు రఘునాథ్. పి వి ఎస్ వి ప్రసాదరావులు. ఒక ప్రకటనలో హర్షం వెలిబుచ్చుతు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కడప జిల్లా పేరు మరుగున పండిందని ఎంతో మంది ఆవేదనతో వున్నారని అటువంటి వారికి ఈ నిర్ణయం ఎంతో మందికి సంతోషకరమని వారు పేర్కొన్నారు

జ్యోతి క్షేత్రంలో కూల్చివేతలు దారుణం: కాంగ్రెస్

విశాలాంధ్ర-పులివెందుల: కడప జిల్లా కాశి నాయన మండలంలోని జ్యోతి క్షేత్రంలో కూల్చివేతలు దారుణమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేతిరెడ్డి తిరుపాల్ రెడ్డి పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ దశాబ్దాల తరబడి జ్యోతి క్షేత్రంలో అవధూత కాశినాయన స్వామి భక్తుల నీరాజనాలు అందుకుంటున్నారన్నారు. ఇటీవల కాలంలో టైగర్ ఫారెస్ట్ పేరిట అక్కడ ఆశ్రమాలు, గోశాల, పూదో టలు మరి కొన్ని వాటిని కూల్చివేయడంతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆయన వెల్లడించారు. కాశి నాయన క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కానీ ఇక్కడ కూల్చివేతలు ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదన్నారు. వన్యమృగ ప్రాణులు ఉన్నాయంటే అందుకు ప్రభుత్వము భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇవేవి పట్టించుకోకుండా ఒక్కసారిగా కూల్చివేతలు ప్రారంభించడంతో భక్తులు ఆగ్రహిస్తున్నారని తిరుపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కూల్చివేసిన వాటిని పునర్ నిర్మించాలని, అలాగే పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. ఇదే విషయాన్ని ఏపీపీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి, సీనియర్ నేత డాక్టర్ ఎన్ తులసి రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్తానని ఆయన స్పష్టం చేశారు. భక్తుల అగ్రహాలకు గురికాకముందే ప్రభుత్వం స్పందించి జ్యోతి క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దాలని కాంగ్రెస్ పార్టీ తరఫున కోరుతున్నట్లు పేర్కొన్నారు.

బోర్లను పరిశీలించిన సర్పంచ్



విశాలాంధ్ర-వేంపల్లి: వేసవిలో నీటి సమస్య రాకూడన్న ఉద్దేశంతో వేంపల్లి పాపాఘ్ని నదిలో బోర్లను వేంపల్లి సర్పంచ్ ఆర్ శ్రీనివాసులు మంగళవారం పరిశీలించారు. అడుగంటి పోయిన బోర్లను తీసి పక్కన మంచినీటి కోసం మళ్ళీ బోర్లు వేయాలని అధికారులను ఆదేశించారు.ఎట్టి పరిస్థితులలో వేసవికాలంలో వేంపల్లి గ్రామపం చాయతీ ప్రజలకు తాగునీటి సమస్య ఉండకూడదని శ్రీనివాసులు ఈ సందర్భంగా తెలిపారు. ఆయన వెంట పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఆధ్యాత్మిక పర్యాటక హబ్‌గా ఒంటిమిట్ట

విశాలాంధ్ర - ఒంటిమిట్ట: ఆధ్యాత్మిక పర్యాటక హబ్ గా ఒంటిమిట్ట ను అభివృద్ధి చేస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు శాసనమండలిలో మంగళవారం ఫిమేరకు ప్రకటించారు ఒంటిమిట్ట కోదండరామాలయం అభివృద్ధి వీటితోపాటు ఒంటిమిట్ట చెరువును కూడా అభివృద్ధి చేస్తామన్నారు ఒంటిమిట్ట చెరువులో బోటింగ్ ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకర్షిస్తామన్నారు తెలుగు హిందీ తమిళం వంటి భాషలపై కూడా గైడ్ ను ఏర్పాటు చేసి ఆలయ చరిత్రకు ప్రాచుర్యం కల్పిస్తామన్నారు హరిత రెస్టారెంట్లు అభివృద్ధి చేస్తామన్నారుఅంతేగాక కడప కర్నూలు జిల్లాలో నిపర్యాటక కేంద్రాలు కలుపుకొని ఒంటిమిట్ట కేంద్రంగా పర్యటక హబ్ చేస్తామన్నారు.

గాంధీపురం లో మున్సిపల్ అధికారుల హల్ చల్

ఇంటి పన్నుల వసూళ్ల కోసం ఇళ్లను చుట్టుముట్టిన అధికారులు

విశాలాంధ్ర- మదనపల్లె : మదనపల్లె పట్టణం, దళితులు నివాసం ఉంటున్న గాంధీపురంలో మున్సిపల్ మున్సిపల్ శాఖ అధికారులు మంగళవారం హల్ చల్ చేశారు. ఇంటి పన్నుల వసూళ్ల నిమిత్తం అధిక సంఖ్యలో సిబ్బంది, అధికారులు గాంధీపురాన్ని చుట్టుముట్టి ఇంటింటికి వెళ్లి ఇంటి పన్ను కట్టాలని లేదంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దళితులు నివాసమున్న గాంధీపురంలో అందరూ కూలీనాలీ చేసుకుని జీవనం చేసేవారే. రెక్కాడితేకానీ డొక్కాడని కుటుంబాలు వారివి. అయితే ఇంటి పనులు కట్టకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రతిరోజు ఇంటి తలుపులు తట్టడం, మంగళవారం రోజున ఏకంగా మున్సిపల్ కమిషనరే రంగంలోకి దిగడం, అధిక సంఖ్యలో అధికారులు రావడంతో ఇక్కడ ప్రజలు ఒకింత ఆందోళనకు గురయ్యారు. పన్ను కట్టకపోతే ఏమి చేస్తారోనన్న భయాందోళన లకు గురయ్యారు. మున్సిపల్ కమిషనర్ ప్రమీల అధికారులతో గాంధీపురంలో ఇంటింటికి తిరగడంతో ఇక్కడి వాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటిపన్ను కచ్చితంగా కడుతామని, అయితే తమకు సమయం కావాలని చెబుతున్న సచివాలయ సిబ్బంది రోజు ఇంటి తలుపు కొడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు. పట్టణంలో పెద్దపెద్ద అపార్ట్మెంట్స్, కమర్షియల్ కాంప్లెక్స్ వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, మున్సిపల్ కాంప్లెక్స్ లలో అద్దెకుంటున్నవారు, రాజకీయ పలుకుబడి ఉన్నవారు ఇలా ఎంతోమంది లక్షల్లో బకాయిలు ఉన్న వారి నుంచి బకాయిలు వసూలు చేయడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలం అవుతున్నారు. కారణం వారికి పలుకుబడి, పార్టీలు, రాజకీయ నాయకుల అండ ఉండడమే కారణం. అయితే ఏ పలుకుబడి లేని కూలీనాలీ చేసుకుని, జీవనం సాగిస్తున్న కుటుంబాలపై ఇంటి పన్నులంటూ ఏక ధాటిగా అధికారులందరూ మీద పడటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు సంయమనం పాటించాలని, ముఖ్యంగా స్లం ఏరియాలలో, దళితులు నివసిస్తున్న ప్రాంతాలలో కాస్త ఓపిగ్గా పన్నులు వసూలు చేయాలని పలువురు సూచిస్తున్నారు.

ఫార్మసీ కళాశాలలో ఘనంగా ఫార్మా డీ ఉత్సవాలు



విశాలాంధ్ర -రాజంపేట: అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత ఆధ్వర్యంలో మంగళవారం ఫార్మా డీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అన్నమాచార్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ సాయిబాబా రెడ్డి, కళాశాల వైస్ చైర్మన్ చొప్ప ఎల్లారెడ్డి పాల్గొని ప్రసంగిస్తూ ప్రతి విద్యార్థి తాను విద్యను అభ్యసించిన కళాశాలలో తనకు ఉన్న అనుభవాలతో ముందుకు సాగుతూ ఆధునికత గురించి సూచనలు ఇవ్వాలని తెలిపారు. తమ కళాశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులు విదేశాలలో గొప్ప స్థాయిలో స్థిరపడ్డారని, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రస్తుతం విద్య పూర్తి కాబోయే విద్యార్థులు కూడా ఆ స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థినీ -విద్యార్థులు పాల్గొన్నారు.

జిడిఎస్ సమస్యలు పరిష్కరించండి

- టార్గెట్ల ఒత్తిడి తగ్గించండి - రాష్ట్ర కార్యదర్శి వెంకట్రామిరెడ్డి

విశాలాంధ్ర-రాయచోటి: దేశవ్యాప్తంగా తపాలా శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 277000 లక్షల మంది గ్రామీణ డాక్ సేవకుల (జిడిఎస్)సమస్యలు పరిష్కరించాలని భారతీయ గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్రామిరెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కోరారు. రాయచోటిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిపార్ట్మెంట్ ఉద్యోగులతో సమానంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు, మారుమూల ప్రాంతాలకు తపాలాశాఖ సేవలందిస్తూ కనీస వేతనాలకు నోచుకోలేక గత 8 దశాబ్దాల కాలంగా తీవ్ర అన్యాయానికి గురి అవుతూ అర్ధాకలితో, అసంతృప్తితో ఉన్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని 129497 పోస్ట్ ఆఫీసుల ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తూ రేపటి మంచి రోజు కోసం ఎదురు చూస్తూ జిడిఎస్ వ్యవస్థ రద్దు చేయమని రెగ్యులర్ ఉద్యోగులుగా ప్రకటించాలని ఆయన కోరారు. ఉపాధి హామీ కూలీలకు డబ్బుల పంపిణీ, ఆసరా పింఛన్లు లబ్ధిదారులకు అందిస్తూ ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకింగ్ సేవలను చిన్న మొత్తాల పొదుపు గ్రామీణ తపాలా జీవిత బీమా, అటల్ పెన్షన్ యోజన ప్రజలకు అందిస్తున్నారు ప్రధానమంత్రి మానసపుత్రిక సుకన్య సమృద్ధి యోజన పథకం ప్రచార బాధ్యత, సేవల వితరణ బాధ్యత భుజాలకు ఎత్తుకొని సేవలు అందిస్తున్నారు. ప్రజలతో మమేకమై దేశ ఆర్థిక అభివృద్ధి కోసం కృషి చేస్తూ దేశ అభివృద్ధికి తమ వంతు కర్తవ్యం నిర్వహిస్తూ న్యాయమైన కోరిక ప్రభుత్వం ముందర ఉంచితే 2011 సంవత్సరంలో దుర్మార్గ కాంగ్రెస్ పార్టీ జి డి ఎస్ కాండక్ట్ రూల్స్ ను నిరంకుశంగా మార్పి అందులో కార్మిక హక్కులు హరించే రూల్ 3జీ, 5జీ, 290ను అదనంగా చేర్చి కండక్ట్ రూల్స్ లో ఎంప్లాయిమెంట్ అనే పదం పూర్తిగా తొలగించి అపాయింట్మెంట్ అనే పదాన్ని ఎంగేజ్మెంట్ గా మార్చి దేశంలోని 277000 లక్షల మంది జి డి ఎస్ కుటుంబాల ఉసురు పోసుకుంది అందుకు తగిన మూల్యం చెల్లించి అధికారము కోల్పోయింది. తదుపరి అధికారం చేపట్టిన యన్ డిఎ ప్రభుత్వం జిడిఎస్ ఉద్యోగుల స్థితిగతుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరిస్తుందని, జిడిఎస్ ఎస్ కండక్ట్ రూల్స్ లో లోపాలను సవరించి 2001 సంవత్సరంలో ఉన్న జి డి ఎస్ కాండక్ట్, ఎంప్లాయిమెంట్ రూల్స్ పునరుద్ధరించాలని తమ యూనియన్ కోరుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ తపాల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వేతనాల సవరణకు 1957 వ సంవత్సరం సెకండరీ పే కమిషన్ సివి రాజన్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది 1973 వ సంవత్సరం మదన్ కిషోర్ కమిటీ వేశారు 1986 సవ్వూరు కమిటీ వేయడం జరిగింది. 1996 వ సంవత్సరం తల్వార్ కమిటీ నియమించడం జరిగింది. అలాగే 2006 సంవత్సరం నటరాజ మూర్తి కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. 2015 వ సంవత్సరం కమలేష్ చంద్ర కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. అయితే కమిటీ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయడంలో లో నిర్లక్ష్యం పక్షపాతం సవతి తల్లి ప్రేమ చూపిస్తుంది అని ఆయన ఆరోపించారు కమిటీలు ఎన్ని సిఫార్సు చేసినా వాటిలో కొన్నిటిని మాత్రమే తూతూమంత్రంగా అమలుచేయడం మిగిలిన సిఫార్సును గాలికి వదిలేయడం జరుగుతుందని ఆయన ఆరోపించారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సుల మేరకు 12, 24, 36 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన సీనియర్ జిడిఎస్ ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా తూతూ మంత్రంగా ప్రత్యేకంగా ఇవ్వడం జరుగుతుంది గ్రూప్ ఇన్సూరెన్స్ మొత్తాన్ని 5లక్షలకు పెంచాలి. సెలవులను 180 రోజులు వరకు దాచుకొని రిటైర్మెంట్ సమయంలో నగదుగా మార్చుకునే విధంగా ఆదేశాలు ఇవ్వాలి. సింగిల్ హ్యాండ్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ లకు కంబైండ్ డ్యూటీ అలవెన్స్ మంజూరు చేయాలి. పదవీ విరమణ బెనిఫిట్స్ అన్ని పదవి విరమణ రోజున చెల్లించాలని వెంకట్రామిరెడ్డి కోరారు.

టార్గెట్ల ఒత్తిడి తగ్గించండి

గ్రామీణ తపాలా ఉద్యోగులపై డిపార్ట్మెంట్ ఉన్నత శాఖ అధికారులు పోస్ట్ ఆఫీస్ లోని పథకాలకు టార్గెట్లు నిర్ణయించి ప్రతి నెల గ్రామీణ తపాల ఉద్యోగులపై ఒత్తిడి పెంచి పని చేయించడం దారుణం అన్నారు. అధికారుల ఒత్తిడి వలన జిడిఎస్ లు సొంత డబ్బుతోనే పలు పథకాల టార్గెట్లు పూర్తి చేస్తున్నారు. డమ్మీ అకౌంట్స్ వల్ల డిపార్ట్మెంట్ కు లాభం కంటే నష్టమే ఎక్కువ ఉంటుంది, తపాలా శాఖ ఉన్నతాధికారులు టార్గెట్లకు చెందిన అకౌంట్లను పరిశీలిస్తే 80 శాతం జిడిఎస్ ల సొంత డబ్బులతో చేసిన 100 రూపాయల ఆర్డీ అకౌంట్లు ఉన్నాయి కావున ఇలాంటి టార్గెట్లు ఆపి ప్రజల నుంచి వచ్చే ఖాతాలు తెరిస్తే డిపార్ట్మెంట్ లాభదాయకంగా ఉంటుందని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న పాలక పార్టీలు

డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల భారాలు మోపుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తుందని అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ దాని ప్రయోజనాలను ప్రజలకు అందించడం లేదని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయంచేస్తున్నాయని ఆరోపించారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇటు రాష్ట్రంలోను అటు కేంద్రంలోను అధికారం చేజిక్కించుకున్న ప్రభుత్వాలు ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయన్నారు. ఇలాగే జరుగుతూ పోతే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం తథ్యమని ఆమె హెచ్చరించారు. అనంతరం పార్టీ అంతర్గత సమావేశం నిర్వహించి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకును కడప నుంచి తరలించవద్దని వచ్చిన యూనియన్ నాయకుల నుంచి వినతిపత్రం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, కడప అసెంబ్లీ కన్వీనర్ బండి జకరయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి అలీఖాన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రైళ్లు నిలపాలని కేంద్ర మంత్రికి ఎంపి వినతిపత్రం

విశాలాంధ్ర రైల్వేకోడూరు: రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం కోసం రాజంపేట, రైల్వేకోడూరు, నందలూరు,రెడ్డిపల్లి, ఓబులవారిపల్లి తదితర ప్రాంతాలలో రైళ్లు నిలపాలని మంగళవారం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు రాజంపేట పార్లమెంట్ సభ్యులు కేంద్ర మంత్రిత్వశాఖ సంప్రదింపుల కమిటీ (హోంశాఖ) సభ్యులు పెద్దిరెడ్డి వెంకటమిధున్ రెడ్డి వినతిపత్రం సమర్పించారని గుంటకల్ రైల్వే డివిజన్ బోర్డు సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి పాత్రికేయులకు తెలిపారు. రాజంపేటలో చెన్నై సూపర్ ఫాస్ట్,సంపర్క్ క్రాంతి, హరిప్రియ,రైల్వేకోడూరు లో హరిప్రియ, చెన్నై సూపర్ ఫాస్ట్, ఎగ్మోర్, రెడ్డిపల్లిలో ఇంటర్ సిటీ,అర్కోణం, ఓబులవారిపల్లి లో రాయలసీమ,తిరుమల ఎక్స్ ప్రెస్, నందలూరు లో వెంకటాద్రి, రాయలసీమ రైళ్లు నిలిపి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని ఎంపి రైల్వే మంత్రి ని కోరారు.మంత్రి సానుకూలంగా స్పందించారు,నాలుగు రైల్వేస్టేషన్ లోనుండి ప్రయాణించే ప్రయాణికులకు త్వరలోనే ఆశలు నెరవేరే తీపి ఉత్తర్వులు వస్తాయని భరత్ తెలిపారు.